WWW.MAHAADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం జిల్లా వార్తలు 01
శుక్రవారం, హైదరాబాద్ | 12-09-2025

# మూడు లక్షల మత్తు.. ఖజానాకు ఝలక్!

- ఎన్నికల మత్తులో ఎక్సైజ్ శాఖ లెక్కలు తారుమారు
- మద్యం టెండర్లకు భారీగా తగిన దరఖాస్తులు
- ఆంధ్రా వ్యాపారులకు ఎక్కని కిక్కు
- కనిపించని ఎలక్షన్ ఎఫెక్ట్
- ఎక్సైజ్ శాఖకు తగ్గిన ఆదాయం



**ఖమ్మం బ్యూరో, మహా :** లైసెన్స్ దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచడం ద్వారా రాష్ట్ర ఖజానాను నింపాలనుకున్న ఎక్సైజ్ శాఖ అధికారుల ఆశలు అడియాశలయ్యాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ ఈసారి ఊహించని విధంగా వెనకడుగు వేసింది. గతం కంటే దరఖాస్తుల సంఖ్య దాదాపు 30% పడిపోయింది. ఈ భారీ తగ్గుదల కారణంగా ఫీజు పెంపు ద్వారా రావాల్సిన అదనపు ఆదాయం కేవలం 3.96%కే పరిమితమైంది. ఇది వ్యాపార వర్గాల ఉత్సాహం తగ్గిందని, రియల్ ఎస్టేట్ మందగమనం వంటి మార్కెట్ పరిస్థితులు వ్యాపారంపై నీడ వేశాయని స్పష్టం చేస్తోంది.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ ఈసారి ఊహించని మలుపు తిరిగింది. 2023%-%25 లైసెన్స్ కాలానికి కంటే ఈసారి దరఖాస్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఎక్సైజ్ శాఖ లైసెన్స్ దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచడం ఖజానాకు మేలు చేస్తుందనుకున్న అధికారుల లెక్కలు పూర్తిగా తారుమారయ్యాయి. దరఖాస్తులు తగ్గడంతో రాష్ట్ర ఖజానాకు ఆశించిన 'కిక్కు' కూడా తగ్గినట్టేనని తెలుస్తోంది.

**భారీగా తగ్గిన దరఖాస్తులు**

ఎక్సైజ్ శాఖ సమాచారం ప్రకారం, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దరఖాస్తుల సంఖ్య గత సీజన్‌తో పోలిస్తే సుమారు 30.7% తగ్గింది. ఖమ్మం జిల్లాలో 116 షాపులకు గత సీజన్లో 7,207 దరఖాస్తులు వస్తే, ఈసారి సుమారు 4,500కే పరిమితమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 88 షాపులకు గతంలో 5,057 దరఖాస్తులు రాగా, ఈసారి సుమారు 4,000 మాత్రమే వచ్చాయి. మొత్తంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దరఖాస్తులు 12,264 నుంచి 8,500కి పడిపోయాయి. అంటే, 3,764 దరఖాస్తులు తగ్గాయి.

**ఆదాయ వృద్ధి అంచనాలు తలకిందులు**

దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు (50% పెంపు) పెంచినప్పటికీ, ఆదాయ వృద్ధి అంచనాలకు తగ్గట్టుగా లేదు. 2023%-%25 లైసెన్స్ కాలంలో రూ.2 లక్షల ఫీజుతో వచ్చిన మొత్తం ఆదాయం ?245.28 కోట్లు కాగా, ఈసారి రూ.3 లక్షల ఫీజుతో ?255 కోట్లుగా నమోదైంది. దరఖాస్తులు 30.7% తగ్గడంతో, ఆదాయం కేవలం ?9.72కోట్లు మాత్రమే అంటే 3.96% మాత్రమే పెరిగింది. పాలసీ మార్పుల కారణంగా ఎక్సైజ్ శాఖ వేసిన అంచనాలు పూర్తిగా విఫలమయ్యాయి.

**ఫీజు పెంపు, మార్కెట్ మందగమనం**

ఈసారి రూ.3 లక్షల దరఖాస్తు ఫీజు అనేక మంది చిన్న వ్యాపారులను వెనక్కి నెట్టింది. ఎన్నికల సీజన్‌లో వ్యాపారులు పెట్టుబడుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. అదీ కాక, రియల్ ఎస్టేట్ మందగమనం వంటి మార్కెట్ పరిస్థితులు మద్యం వ్యాపారంపై కూడా నీడ వేశాయి. "ఇంత పెద్ద ఫీజు పెట్టి షాపు దక్కకపోతే నష్టం మామూలు కాదు. మార్కెట్ లాభాలు తగ్గిపోయాయి. మద్యం వ్యాపారంలో పాత రాక లేదు," అని వ్యాపారులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**ఓపెన్ కేటగిరీలపై ఆంధ్ర వ్యాపారుల ఆసక్తి**

రిజర్వేషన్ కేటగిరీలకంటే ఓపెన్ కేటగిరీ షాపులకే ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. ఇందులో పక్కరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన వ్యాపారులు కూడా టెండర్లలో, ముఖ్యంగా ఓపెన్ షాపుల్లో బలంగా బిడ్ చేసినట్లు సమాచారం. ఆంధ్ర వ్యాపారుల ప్రవేశంతో స్థానిక వ్యాపారులకు పోటీ పెరిగి, కొందరు దరఖాస్తు వేయకుండానే వెనక్కి తగ్గినట్లు స్థానిక వ్యాపార వర్గాలు అంటున్నాయి.

**భవిష్యత్తులో పాలసీ సమీక్ష తప్పదు**

రాష్ట్ర ఖజానాకు భారీగా డబ్బు రాబడుతుందని ఆశించిన అధికారులను ఈ గణాంకాలు నిరాశపరిచాయి. "ఫీజు పెంచితే ఖజానా నిండుతుందనుకున్నాం కానీ వ్యాపారుల ఉత్సాహం తగ్గిపోయింది," అని ఎక్సైజ్ వర్గాలు పరోక్షంగా అంగీకరిస్తున్నాయి. ఎన్నికల తర్వాత ఎక్సైజ్ పాలసీని పునఃసమీక్షించే అవకాశాలున్నాయి. దరఖాస్తు ఫీజును మళ్లీ రూ.2 లక్షలకు తగ్గించాలని వ్యాపార సంఘాలు కోరుతున్నాయి. మద్యం వ్యాపారంపై అదనపు భారాన్ని మోపడం సరికాదని వారు అభిప్రాయపడుతున్నారు. ఫీజు పెంపు ఫలితంగా దరఖాస్తులు తగ్గి, వ్యాపార ఉత్సాహం చల్లబడటం, ఓపెన్ కేటగిరీలలో ఆంధ్ర వ్యాపారుల ప్రవేశం వంటి అంశాలు రాబోయే రోజుల్లో రాజకీయంగా కూడా చర్చనీయాంశమయ్యే అవకాశం ఉంది.

## సింగరేణి కీలక ఖనిజ రంగంలో మరో ముందడుగు

- సింగరేణిలో అరుదైన ఖనిజాలు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంసిద్ధం
- ఎన్.ఎఫ్.టీ.డీసీ సంస్థ సాంకేతిక సహకారంతో ప్రయోగాత్మకంగా ప్లాంట్ ఏర్పాటు
- త్వరలోనే పైలట్ ప్లాంట్ నిర్మాణం
- సీఎండీ ఎన్.బలరామ్



**భద్రాద్రి బ్యూరో, మహా :** సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా కీలక ఖనిజ రంగంలో కూడా ప్రవేశించాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ దిశగా మరో ముందడుగు వేసింది. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి ప్రాంతంలో రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ గుర్తించి ఉత్పత్తి చేయడానికి ఒక ప్రయోగాత్మక ప్లాంటు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు హైదరాబాద్ సింగరేణి భవన్ లో గురువారం కేంద్ర ప్రభుత్వ అధికారిక పరిశోధన సంస్థ ఎన్.ఎఫ్.టి.డి.సి (నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్ మెంట్ సెంటర్)తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ తరపున ఛైర్మన్ ఎండీ ఎన్. బలరామ్, ఎన్.ఎఫ్.టి.డి.సి నుంచి ఎన్ఎఫ్టిడీసీ డైరెక్టర్ బాలసుబ్రమణియన్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ వివరాలను ఛైర్మన్ ఎండీ బలరామ్ వివరిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలను మరింత వేగవంతం చేస్తుందని దీనిలో భాగంగా సింగరేణి ప్రాంతంలో లభ్యమవుతున్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ఉనికిని తెలుసుకోవడానికి లభ్యమవుతున్న రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను ఉత్పత్తి చేయడానికి ప్రయోగాత్మకంగా ఒక ప్లాంట్ ను కొత్తగూడెం ప్రాంతంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించిన సాంకేతిక సహాయాన్ని ఎన్.ఎఫ్.టి.డి.సి సంస్థ నుంచి తీసుకుంటున్నామన్నారు. ఈ ప్రయోగాత్మక ప్లాంట్ లో సింగరేణి ఓవర్ బర్డెన్ మట్టిలో లభించే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ తో పాటు, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్‌లోను, ఇతర వేస్ట్ మెటీరియల్స్ లోను లభ్యమయ్యే రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను గుర్తిస్తామని, ప్రయోగాత్మకంగా వీటిని ఉత్పత్తి చేయడం కూడా జరుగుతుందన్నారు. రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ లభ్యతా శాతం, ఉత్పత్తికి గల అవకాశాలు, వ్యాపార కోణంలో లాభదాయకత తదితర విషయాలను దృష్టిలో పెట్టుకొని తదుపరి పెద్ద ఎత్తున ప్లాంట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఎన్.ఎఫ్.టి.డి.సి ఉన్నతాధికారులు మాట్లాడుతూ సింగరేణి సంస్థలో తాము ఇప్పటికే పరిశోధనలు ప్రారంభించామని, కొన్ని కీలక ఖనిజాలు ఓవర్ బర్డెన్ మట్టిలోనూ, సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి వెలువడే ఫ్లై యాష్ లోను ఉన్నట్లు గుర్తించామని, కొత్తగా స్థాపించనున్న పైలట్ ప్లాంటు ద్వారా మరింత సమగ్రమైన సమాచారం లభించనుందన్నారు. సింగరేణి సంస్థతో కలిసి పనిచేయడం తమకెంతో సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్రక్రమంలో సింగరేణి డైరెక్టర్(పి అండ్ పి)కె.వెంకటేశ్వర్లు, జీఎం(కో ఆర్డినేషన్, మార్కెటింగ్)టి.శ్రీనివాస్, జీఎం(బిజినెస్ డెవలప్మెంట్)రాందాస్, జీఎం(ఎక్స్ ప్లోరేషన్)శ్రీనివాసరావు, ఎన్.ఎఫ్.టి.డి.సి డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ ప్రారంభం



**ఖమ్మం సిటీ, మహా :** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలోని 60 అడుగుల ప్రధాన రోడ్డు, పోస్ట్ ఆఫీస్ రోడ్డును విస్తరించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డు విస్తరణ పనులను సులభతరం చేసేందుకు సంబంధిత దుకాణ యజమానులు, గృహ యజమానులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి, తమ షాపులు, ఆస్తులను స్వచ్ఛందంగా తీసివేయాలని సూచించారు. వీటిని ఆక్రమిస్తున్న దుకాణాలను మున్సిపల్ అధికారులు తొలగించి, రహదారి విస్తరణకు మార్గం సన్నద్ధం చేశారు. ఈ పనులు పూర్తి అయిన తర్వాత రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి, ప్రజలకు రాకపోకలు సులభమవుతాయి. ప్రాజెక్ట్ వేగంగా పూర్తవ్వడానికి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు. ఖమ్మం నగర అభివృద్ధి కార్యక్రమాల్లో నగర వాసులు సహకరించాలని, శుభ్రంగా, సుందరంగా నగరాన్ని నిలిపేందుకు మున్సిపల్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఈఎస్ఐ వైద్య సేవలకై.. దరఖాస్తుల స్వీకరణ



**మణుగూరు, మహా :** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ వైద్య సేవలను అందించేందుకు గాను దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ఏరియా జిఎం దుర్గం రామచందర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ.. ఈఎస్ఐ నమోదు ప్రక్రియకు దరఖాస్తుల స్వీకరణ రెండు రోజులపాటు ఏరియాలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుత రోజులలో వైద్యం బాగా ఖరీదైనదని, ఈఎస్ఐ ద్వారా వైద్య సేవలు పొందడం కాంట్రాక్టు కార్మికులకు ఓ వరమని అన్నారు. ఈఎస్ఐ కార్డు ద్వారా కార్మికులతో పాటు కార్మికుని కుటుంబ సభ్యులు వైద్య సేవలు పొందడమే కాక మెడిసిన్ చదవాలనుకునే వారి పిల్లలకు వైద్య కళాశాలలో ప్రవేశానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ఈఎస్ఐ సేవలు అందుబాటులోకి తేవడానికి కృషి చేసిన సిఎంబి బలరాంకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మణుగూరు ఏరియాలో ఈఎస్ఐ డిస్పెన్సరీని ప్రారంభించాలని ఈఎస్ఐ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఖమ్మం ఈఎస్ఐ శాఖ మేనేజర్ సాయికుమార్, ఏరియా ఎస్ఓ టు జిఎం శ్రీనివాస చారి, డిజిఎం పర్సనల్ ఎస్ రమేష్, కొత్తగూడెం కార్పొరేట్ ఐఆర్ వింగ్ అధికారి వైవిఎల్ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, కార్మిక సంఘాల నాయకులు వై రామ్ గోపాల్, వత్సవాయి కృష్ణంరాజు, నాజర్ పాషా, సెక్యూరిటీ అధికారి కట్ల శ్రీనివాస్, అధికారులు సురేష్, ప్రవీణ్ కుమార్, చంద్ర కిరణ్, సాయి శ్వేత, వంశీకృష్ణ, సాయి మౌనిక తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈఎస్ఐ మేనేజర్ సాయికుమార్ ను ఏరియా అధికారులు శాలువాతో సత్కరించారు.

## గోమాత రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు అవసరం

- బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు
- గోరక్షకుల పై దాడులకు నిరసనగా కలెక్టర్‌కు వినతి



**ఖమ్మం, మహా :** గోమాత సంరక్షణ కోసం ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, గోరక్షకులపై జరుగుతున్న దాడుల విషయంలో చట్టపరమైన చర్యలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడ్చల్ జిల్లా ఘట్కేసర్ వద్ద గో రక్షకుడు సోను (ప్రశాంత్)పై ఎంఐఎం గుండాలు తుపాకీ కాల్పులు జరిపిన ఘటనకు వ్యతిరేకంగా గోరక్షకులపై జరిగిన దాడికి నిరసనగా గురువారం ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ గోమాత మన సాంప్రదాయానికి, జీవన విధానానికి ప్రతీక అని పేర్కొన్నారు. గోరక్షకులు సమాజ సేవలో నిమగ్నమై ఉంటే, వారిపై జరుగుతున్న దాడులు గో సంస్కృతిని దెబ్బతీసే విధంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రభుత్వం తక్షణమే స్పందించి, గోరక్షకుల భద్రతకు చట్ట పరిరక్షణ కల్పించాలి. గోరక్షకులపై దాడులు తక్షణమే ఆగాలి," అని ఆయన డిమాండ్ చేశారు. గోవుల అక్రమ రవాణా, హత్యలు, వ్యాపారాలు సమాజంలో శాంతి-వ్యవస్థకు ముప్పుగా మారుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో, జిల్లా స్థాయిలో తక్షణమే గో సంరక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని, గోరక్షకుల భద్రతపై ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా పరిధిలో ఉన్న రవాణా మార్గాలు, మార్కెట్లపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, చట్టాలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గోశాలల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. పశు సంవర్ధక శాఖ ద్వారా గోశాలలకు మేత, నీరు, వైద్య సేవలు వంటి ప్రాథమిక సదుపాయాలను తప్పనిసరిగా అందించాలని కోరారు. "గోమాతను రక్షించడం కేవలం ధార్మిక బాధ్యత కాదు, అది మన సంస్కృతి, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన సామాజిక కర్తవ్యం. కాబట్టి, ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి," అని ఆయన స్పష్టం చేశారు. ఐతే దాడుల సంఘటనలపై పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని, బాధితులకు వైద్య సహాయం, రక్షణ ఇవ్వాలని కూడా బీజేపీ నాయకులు కోరారు. బీజేపీ నేతల వినతిని స్వీకరించిన జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, గో సంరక్షణకు సంబంధించిన అంశాలను సమీక్షించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లగట్టు ప్రవీణ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు బండారు నరేష్, నున్న రవికుమార్, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## 5 కిలోల బేబీ డెలివరీ!

### భద్రాచలం ఆసుపత్రిలో సరికొత్త చరిత్ర!



**భద్రాచలం, మహా:** భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు సరికొత్త చరిత్ర సృష్టించారు. అరుదైన, క్లిష్టమైన కేసులో ఏకంగా 5 కిలోల బరువు ఉన్న పండంటి మగ శిశువుకు విజయవంతంగా జన్మనిచ్చి, తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నట్టు ప్రకటించారు. గురువారం మణుగూరు పట్టణానికి చెందిన జోగునూరు రాణి అనే తల్లి, ఐదు కేజీల బరువున్న శిశువుకు జన్మనివ్వడంతో ఆసుపత్రి ప్రాంగణం ఆశ్చర్యంతో పాటు అంతులేని ఆనందంలో మునిగిపోయింది. ఈ శిశువును 'బాల భీముడు' అంటూ ముద్దుగా పిలుచుకుంటున్నారు.

**క్లిష్ట పరిస్థితిలో విజయవంతమైన ఆపరేషన్**

మణుగూరుకు చెందిన జోగునూరు రాణికి పురిటి నొప్పులు రావడంతో, ఆమెను మొదట మణుగూరు ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య పరీక్షల్లో ఆమెకు షుగర్ లెవెల్స్ తీవ్రంగా పెరిగి ఉండటాన్ని గుర్తించారు. ఇది ప్రసవానికి అత్యంత క్లిష్టమైన పరిస్థితి కావడంతో, తక్షణమే మెరుగైన చికిత్స కోసం భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. భద్రాచలం ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ పర్యవేక్షణలో గైనకాలజిస్ట్ డాక్టర్ల బృందం వెంటనే రంగంలోకి దిగింది. తల్లి పరిస్థితిని, శిశువు బరువును అంచనా వేసి ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. ఆపరేషన్ విజయవంతమై, పండంటి మగ బిడ్డ జన్మించగా, అతని బరువు చూసి ఆసుపత్రి సిబ్బంది, కుటుంబ సభ్యులు నోరెళ్లబెట్టారు. ఆ శిశువు బరువు సరిగ్గా 5 కేజీలు! ఈ అసాధారణ బరువున్న శిశువు ఆరోగ్యంగా ఉండటం వైద్య నిపుణుల నైపుణ్యానికి నిదర్శనం.

**ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజలకు భరోసాలి**

తల్లి బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని ధృవీకరించిన అనంతరం, సూపరింటెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ మాట్లాడుతూ, "ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంత బరువున్న ఆరోగ్యకరమైన శిశువుకు విజయవంతంగా జన్మనివ్వడం మాకు ఎంతో గర్వకారణం. ఇది మా వైద్య బృందం కృషికి, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న అత్యాధునిక సౌకర్యాలకు నిదర్శనం. పేద, మధ్య తరగతి ప్రజలందరూ ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని, సంపూర్ణ భరోసాతో ప్రభుత్వ ఆసుపత్రులలోనే కాన్పులు చేయించుకోవాలని" విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం తల్లి రాణి, 5 కేజీల 'బాల భీముడు' సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. ఈ అరుదైన జననం భద్రాద్రి జిల్లాలో హర్షాతిరేకాలు నింపింది.

## వైద్య కళాశాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి



**భద్రాద్రి బ్యూరో, మహా :** వైద్య విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించి కళాశాల అన్ని విభాగాలు వసతులు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా కలెక్టర్ కొత్తగా నిర్మాణంలో ఉన్న హాస్టల్ వసతి భవనాన్ని పరిశీలించి నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ఎంబీ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్య కళాశాల అభివృద్ధి అంటే విద్యార్థుల సమగ్ర అభివృద్ధి అని వారికి సౌకర్యవంతమైన వసతి పరిశుభ్రమైన ఆవరణ ఉత్తమ విద్యా వాతావరణం ఆధునిక పరికరాలు అందుబాటులో ఉండాలన్నారు. వైద్య విద్యార్థుల భవిష్యత్తు దేశ ఆరోగ్య రక్షణకు పునాది అవుతుంది కాబట్టి కళాశాల అభివృద్ధిని ప్రాధాన్యంగా తీసుకోవాలని ఆయన అన్నారు. కళాశాల ఆవరణలో పచ్చదనం ఉట్టిపడేలా మొక్కలను నాటలని విద్యార్థులలో పర్యావరణ స్ఫూర్తి పెంపొందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు సులభంగా కళాశాలకు చేరుకునేలా బస్సు ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసి బస్సు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైద్య విద్యార్థులకు మెరుగైన బోధన వాతావరణం కల్పించేందుకు ల్యాబ్‌లు, లెక్చరర్ గ్యాలరీ, క్లాస్‌రూములు, లైబ్రరీ వంటి కళాశాల విద్యార్థులకు మెరుగైన బోధన, శిక్షణ అందించేందుకు అవసరమైన మౌలిక వసతులపై పూర్తి నివేదికను సమర్పించాలనీ దానిపై ప్రాధాన్య క్రమంలో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది లెక్చరర్ గ్యాలరీ ఏర్పాటుకు విజ్ఞప్తి చేయగా దానిని త్వరలోనే అమలు చేసేలా చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పర్యటనలో వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ రాజ్ కుమార్, డాక్టర్ సురేష్ బాబు వార్డెన్, కోటేశ్వరరావు ఏడిఈ, అధ్యాపకులు, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి పీఠానికి వంట సామాగ్రి వితరణ

**కారేపల్లి, మహా :** కారేపల్లి గంగమ్మ తల్లి ఆలయ సమీపంలోని కమ్యూనిటీ హాల్లో కారేపల్లి అయ్యప్ప భక్త బృందం ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పీఠం లో స్వాములకు నిత్య అన్నదానానికి అవసరమైన వంట సామాగ్రిని దాతలు గురువారం వితరణ చేశారు దాతలు అప్పల శేఖర్ -లక్ష్మి, కొరుప్రోలు శ్రీ రామారావు-సునంద, మోరిశెట్టి శంకర్ నారాయణ, సంద్రు సుధీర్, చిక్క శ్రీనివాస్ -త్రివేణి, ఖమ్మం శ్రీ సాయి బాలాజీ మెడికల్, సాయి లక్ష్మి మెడికల్స్, మహేశ్వర మెడికల్స్, ఇల్లందు యతేంద్రనాథ్- నీలిమ లు స్టవ్, డెకిషలు ఇతర వంటకు అవసరమైన సామాన్లు అందించారు. కారేపల్లి హాతి ఎలక్ట్రికల్స్ ముఖీమ్ అబ్దుల్ , ఓరుగంటి రాజు లు 10 కుర్చీలను వితరణ చేశారు.

**కారేపల్లిలో ప్రారంభమైన అయ్యప్ప దీక్షలు**

కారేపల్లి లోని గంగమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని కమ్యూనిటీ హాల్ లో గురువారం అయ్యప్ప దీక్షాదారులు పీఠం ఏర్పాటు చేసి మండల దీక్ష ను ప్రారంభించారు. 27 మంది అయ్యప్ప భక్తులు అయ్యప్ప మాలలు ధరించి పీఠం వద్ద పూజా కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నాగసాయి గురు స్వాములు గుగులోత్ రాందాస్, కేతిమాల శీను,సంగు సాయి, పాలిక శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవు

**కొత్తగూడెం రూరల్, మహా :** ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అదేశాల మేరకు చైతన్యం - డ్రగ్స్ పై యుద్ధం కార్యక్రమాలలో భాగంగా కొత్తగూడెం సబ్ డివిజన్లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి కేసులతో సంభంధం ఉన్న వ్యక్తులకు గురువారం తన కార్యాలయంలో కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్ కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ గంజాయి కేసులలో సస్పెక్ట్ షీట్స్ తెరవబడి ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా పెట్టడం జరిగిందని అన్నారు. గతంలో గంజాయి అక్రమ రవాణా విక్రయం సేవించడం వంటి అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకోని వ్యక్తులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కష్టపడి సంపాదించి కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంతంగా గడపాలని సూచించారు. డ్రగ్స్ ను సమూలంగా నిర్మూలించడంలో పోలీస్ వారికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే సమాచారం అందించి భాధ్యతగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం 2టౌన్ సీఐ ప్రతాప్, జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, 1టౌన్ సీఐ కరుణాకర్, కొత్తగూడెం 3టౌన్ సీఐ శివప్రసాద్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అశ్వాపురంలో సీఎస్బీ బ్యాంకు సేవలు ప్రారంభం



**అశ్వాపురం, మహా :** దేశంలోనే 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన బ్యాంకుగా 1920లో మొదలై సుమారు 900 పైగా బ్రాంచ్ లు నెలకొల్పి అన్ని రకాల సేవలను అందిస్తున్న బ్యాంకుగా సిఎస్ బి గుర్తింపు పొందిందని ప్రస్తుతం అశ్వాపురం మండలంలో సేవలు ప్రారంభించడం సంతోషకరమైన విషయమని సి ఎస్ బి బ్యాంక్ వరంగల్ క్లస్టర్ హెడ్ ఆనంద్ కుమార్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సి ఎస్ బి బ్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హెచ్ డబ్ల్యూ పిఎం జిఎం శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి సేవలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అశ్వాపురంలో బ్యాంకును నెలకొల్పడం సంతోషకరమైన విషయమని ప్రజలకు అందుబాటులో ఉండి అన్ని రకాల సేవలను వారు అందుకునే విధంగా ఉద్యోగులు నడుచుకోవాలని అన్నారు. అతిథిలుగా హాజరైన ఎస్ కె టి గ్రూప్స్ డైరెక్టర్ పిచ్చేశ్వరరావు, బి.ఆర్.ఎస్ మాజీ మండల అధ్యక్షులు కృష్ణార్జున రావు లు జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం వారు మాట్లాడుతూ సి ఎస్ బి బ్యాంక్ అన్ని బ్యాంకుల వల్లే వారి సేవలను అందిస్తుందని ప్రతి ఒక్కరూ వీరు సేవలను వినియోగించుకోవాలని అన్నారు. అశ్వాపురం సి ఎస్ బి మేనేజర్ ఏడుకొండలు మాట్లాడుతూ వినియోగదారులకు అందుబాటులో ఎటిఎం, లాకర్ సదుపాయాలను కూడా ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో భారజల ఉద్యోగి ఎన్ వి రావు, సీఐ అశోక్ రెడ్డి, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

ANN తెలుగు
WWW.MAHAADAILY.COM
మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ । 24-10-2025





# పేదల సొంతింటి కల నెరవేర్చటమే.. ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**● పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు**

**బూర్గంపాడు మహా :** పేదల సొంతింటి కలను నెరవేర్చి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తెలంగాణ ప్రజా ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇళ్లు పథకం' అ మలు చేస్తోందని పినపాక శాసనసభ్యులు పా యం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు మం డల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇ ళ్ల పథకం ద్వారా అర్హులైనటువంటి 136 మం ది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను ఎ మ్మెల్యే పాయం పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 4.5 లక్షలకు పైగా ఇళ్లను నిర్మించాలని సీఎం రేవం త్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ల క్ష్యంగా నియోజకవర్గానికి 3,500 చొప్పున తొలి విడతలో 4,16,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన అన్నారు. పినపా క నియోజకవర్గంలో ఆదివాసీలు, వెనుకబడిన కులాలవారు, పేదవారు ఎక్కువగా ఉన్నందున 3,500 ఇల్లు సరిపోవని, అదనంగా మరొక 100 0 ఇల్లు కావాలని రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరగా తక్షణమే ముఖ్యమంత్రి రేమత్ రెడ్డిని సంప్రదిం చి అదనంగా 1000 ఇళ్లను మంజూరు చేశా రని ఆయన పేర్కొన్నారు. పూరిగుడిసెలు, తా త్కాలిక ఇళ్లలో ఉంటున్నవారికి ప్రాధాన్యం ఇ స్తున్నారని ఆయన అన్నారు. సొంత స్థలం ఉ న్నవారికి తొలి దశలో ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు, ఆర్థికంగా వెనుకబడిన వ ర్గాలకు పక్కా ఇల్లు నిర్మించుకోవడానికి సహా యం అందించడమే ఇందిరమ్మ ఇళ్లు పథకం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన అన్నారు. సొంత ఇల్లు నిర్మించుకోవడం అనేది ఎలాంటి వారికైనా ఒక అపురూపమైన కల అని ఆయన అన్నారు. అర్హులైనటు వంటి ప్రతి పేదవాడికి ఇం దిరమ్మ ఇల్లు దశలవారీగా మంజూరు చేస్తా మని, ఎవరు అధైర్య పడకూడదని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయినా లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో జమ లా రెడ్డి, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, గ్రా మ పంచాయతీ సెక్రటరీలు, ప్రభుత్వ అధికా రులు, మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణా రెడ్డి, మండల ముఖ్య నాయకులు, కార్యక ర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.





**22 లక్షల 58 వేల రూపాయల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ :**

22 లక్షల 58 వేల రూపాయల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పిన పాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. బూర్గం పాడు మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయం నందు 51 మంది లబ్ధిదారులకు 22 లక్షల 58 వేల రూపాయల విలువగల సీ ఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజ లకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య మని ఆయన అన్నారు. పేద ప్రజలను ఆర్థికం గా ఆదుకునేందుకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని ఆయన అన్నారు. పేద ప్రజలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో జామల రెడ్డి, ప్రభుత్వ అధికారులు, మండల అధ్యక్షులు దుర్గంపూడి కృష్ణారెడ్డి, మండల ముఖ్య నాయకులు, లబ్ధిదారులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం :**

కాటన్ కార్పొరేషన్ ఇండియా పత్తి కొ నుగోలు కేంద్రాన్ని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. బూర్గంపాడు మం డలం లక్ష్మీపురం గ్రామంలో కాటన్ కార్పొరేషన్ ఇండియా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిం చి ఆయన మాట్లాడారు. రైతులు కొనుగోలు కేం ద్రానికి తేమ తక్కువ ఉండి, చెత్తాచెదారం లేని నాణ్యతగల పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే సూచించారు. పత్తిని విక్రయించిన 48 గంటల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమవుతా యని ఆయన తెలి పారు. సీసీఐ కేంద్రం ద్వారా పత్తి రైతులకు మ ద్దతు ధర లభిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకోవాలని ఆయన అ న్నారు. కొనుగోలు కేంద్రం గురించి ప్రజా ప్రతి నిధులు, రైతు సమన్వయ కమిటీ సభ్యులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆధార్ నెంబర్‌కు అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయ న్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవ ద్దని, సీసీఐ కేంద్రాల్లో విక్ర యించి మద్దతు ధర పొందాలన్నారు. రెవెన్యూ అధికారి, మండల వ్యవసాయ అధికారి, పోలీసు అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసి కొనుగోలు ప్రక్రి యపై పర్యవేక్షిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ తాతారావు, మండల వ్య వసాయ శాఖ అధికారి శంకర్, డిస్టిక్ మార్కెట్ ఆఫీసర్ నరేంద్ర, బూర్గంపాడు మార్కెట్ యార్డ్ సెక్రటరీ శారద, మార్కెట్ యార్డు గ్రేడ్ 3 నిర్మల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మండల ముఖ్య నాయకులు, రైతు లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మత్తుకు దూరంగా ఉండండి

- విద్య పై దృష్టి పెట్టండి
- యువత సామాజిక సేవలో ముందుండాలి
- తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి
- కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్





**కొత్తగూడెం టౌన్, మహా:** యువత మత్తులో పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఉత్తమ భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవాలని కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ అన్నారు. గురువారం సుజాతనగర్ సెంటర్లో " చైతన్యం, డ్రగ్స్ పై యుద్ధం" అనే ప్రోగ్రాంలో భాగంగా కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి ఈ నెల 15వ తేదీ నుండి వచ్చే నెల 15వ తేదీ వరకు ప్రతిరోజు చేపట్టే చైతన్య ప్రోగ్రాంలో భాగంగా జనాలకు డ్రగ్స్ గురించి అవగాహన కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని అన్నారు. డ్రగ్స్ అమ్మకం రవాణా కలిగి ఉండడం సేవించడం కొనడం చట్టరీత్యా నేరమని ఆ విధంగా ఎవరైనా పట్టుబడితే అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందరూ డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సిఐ వెంకటేశ్వర్లు, సుజాతనగర్ ఎస్సై రమాదేవి, పోలీస్ సిబ్బంది, అబ్దుల్ కలాం కాలేజ్, ధన్వంతర కాలేజ్, శ్రీ ఫార్మసి కాలేజ్, సుజాతనగర్ హైస్కూల్ కు చెందిన స్టూడెంట్స్, అదేవిధంగా సుజాతనగర్ మండలానికి చెందిన రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాల కట్టడి కోసమే కార్డన్ సెర్చ్

**- మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి**



**అశ్వాపురం, మహా :** డి.ఎస్.పి రవీందర్ రెడ్డి గురువారం అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి బయ్యారం సిఐ వెంకటేష్ ఎస్సైలు రాజేష్, నరేష్‌ల ఆధ్వర్యంలో అశ్వపురం మండల కేంద్రంలో వివిధ కాలనీల్లో ఆధ్వర్యంలో సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్ట న్ సెర్చ్ లో మొత్తం 9 ఆటోలు, 48 టూ వీలర్స్, 7 బీర్లు, 13 క్వార్టర్ బాటిల్లు పట్టుకున్నామని సీఐ అశోక్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం 40 మంది స్పెషల్ స్కాడ్, %ంంజూ% పోలీసులు, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

## ఓ.. నిరుద్యోగి తరలి రా..! కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ ఆగ్రహం



**అశ్వారావుపేట, అక్టోబర్ 23, మహా :** కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ల పేరిట ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో నిరుద్యోగ యువత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నిరుద్యోగ బాకీ కార్డు ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ట్యాంక్‌బండ్ సమీపంలోని జలవిహార్లో జరగనుంది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ. రామారావు, ట్రబుల్ షూటర్‌గా పేరుగాంచిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను గుర్తుచేసి, నిరుద్యోగ యువత హక్కుల కోసం ప్రభుత్వం ముందుకు రావాలని డిమాండ్ చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యంగా తెలిపారు నిర్వాహకులు. ఆశపడి మోసపోయాం గోసపడుతున్నాం, అండగా నిలవండి, కాంగ్రెస్ హటావో నిరుద్యోగి బచావో, కాంగ్రెస్ హటావో తెలంగాణ బచావో అంటూ నినాదాలతో ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు మోహన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మండల సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, ఆరేపల్లి వెంకటేష్ గౌడ్ (గోవింద్), బుచ్చిబాబు, నక్క రాంబాబు, శ్యామ్ రాజా, రమేష్, చిప్పనపల్లి శ్రీను, శ్యామ్, కార్తిక్, మస్తాన్, ఆరిఫ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

## కూలీలకు తప్పిన పెను ప్రమాదం



**కొత్తగూడెం టౌన్, మహా :** కొత్తగూడెం రైల్వే అండర్ బ్రిడ్జి ప్రమాదాలకు నిలయంగా నిలిచిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణ విషయంలో నిబంధనలు పాటించనందున ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. గురువారం తెల్లవారు జామున రైల్వే అండర్ బ్రిడ్జిలో యాష్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో పక్కనే కూలీలతో వెళుతున్న కంకర మిక్సింగ్ మిషనరీ మీద యాష్ ట్యాంకర్ పడడంతో ఆ యంత్రం డామేజి అయింది. భారీ వాహనాలు బ్రిడ్జి మూల మలుపు తిరిగే సమయంలో బ్యాలెన్స్ తప్పి బోల్తా పడుతున్నాయి. గతంలో కూడా అనేక వాహనాలు రైల్వే అండర్ బ్రిడ్జి మధ్యలో పడిన సంఘటనలు ఉన్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని అధికారులు డేంజర్ స్పాట్ గా గుర్తించి భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## 15 రోజులలో రెవెన్యూ సదస్సుల.. దరఖాస్తులను పరిష్కరించాలి

**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం,మహా :** పెండింగ్ ఉన్న రెవెన్యూ సదస్సు దరఖాస్తులను 15 రోజులలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, సాదా బైనామా, భూ భారతి, సెక్షన్ 22 ఏ1, భూ సేకరణ, ప్రభుత్వ భూముల సంరక్షణ, మీసేవ సర్టిఫికెట్లు, కళ్యాణ్ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తుల వంటి వివిధ అంశాలపై కలెక్టర్ చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ పని తీరు ఆధారంగా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, రోజు వారి వ్యవహారాలలో పౌరులతో నేరుగా మనకు సంబంధాలు ఉంటాయని అన్నారు. జిల్లాలో రెవెన్యూ శాఖ పనితీరు సంతృప్తికరంగా లేదని, సిబ్బంది పనితీరు చాలా వరకు ఇంప్రూవ్ కావాల్సి ఉన్నదని, రాబోయే 15 రోజులలో స్పష్టమైన మార్పు కనిపించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రెవెన్యూ సదస్సుల ద్వారా ఖమ్మం డివిజన్ పరిధిలో సాదా బైనామా మినహాయించి వచ్చిన దరఖాస్తులు 4 నెలలు గడిచిన తర్వాత కూడా ఖమ్మం డివిజన్, కల్లూరు డివిజన్ పరిధిలో ఇంకనూ పెండింగ్ ఉండటానికి గల కారణాలను కలెక్టర్ మండలాల వారీగా ఆరా తీశారు. జిల్లాలో ఆమోదించిన దరఖాస్తులలో కొన్ని దరఖాస్తులు మాత్రమే భూ భారతిలో అప్ డేట్ కావడం పట్ల కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సుల తర్వాత రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది విధుల పట్ల తీవ్ర అలసత్వంగా వ్యవహరిస్తున్నారని, పని చేయడం ఇష్టం లేని పక్షంలో సెలవుపై వెళ్లాలని, అనవసరంగా ప్రజలను ఎదురు చూసేలా చేయవద్దని కలెక్టర్ తెలిపారు. అటవీ - రెవెన్యూ శాఖ వివాదాస్పద భూములకు సంబంధించిన దరఖాస్తులను ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చి సర్వే చేయించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అన్నారు. 15 రోజులలో పెండింగ్ సర్వే పనులు పూర్తి కావాలని అన్నారు. మీ సేవా సర్టిఫికెట్ లను పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు సకాలంలో జారీ చేయాలని, ప్రజలు తమ జనన, ఆదాయ, కుల ధృవీకరణ, నివాస, డెత్ ఇతర మీ సేవా సర్టిఫికెట్ కోసం తహసిల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రావద్దని, ప్రతిరోజు మీ సేవా దరఖాస్తులను పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ శాఖల వద్ద అందుబాటులో ఉన్న బడ్జెట్ ఆధారంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులను డిస్పోజ్ చేయాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీ ఖమ్మం డివిజన్ పరిధిలో బడ్జెట్ ఉన్నప్పటికీ దరఖాస్తులు పెండింగ్ లో ఉండడానికి గల కారణాలను కలెక్టర్ ఆరా తీశారు. కల్లూరు డివిజన్ పరిధిలో బడ్జెట్ తక్కువగా వస్తుందని, దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. తహసిల్దార్ కార్యాలయం పరిధిలో పెండింగ్ ఉన్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యేల సమయం తీసుకుని త్వరగా పంపిణీ చేయాలని అన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ తహసిల్దార్ తమ మండల పరిధిలో ఉన్న రిజిస్ట్రేషన్ ప్రోహిబిటెడ్ భూముల జాబితా వివరాలను సెక్షన్ 22 ఏ1 క్రింద నమోదు చేయాలని అన్నారు. రెవెన్యూ సరస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆమోదించిన దరఖాస్తులను ఆన్ లైన్ భూ భారతి పోర్టల్ లో ఇప్పటివరకు కొన్ని మాత్రమే దరఖాస్తులు మాత్రమే అప్ డేట్ చేశారని, మిగిలిన ఆమోదించిన దరఖాస్తులను వెంటనే ఆన్ లైన్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, సర్వే ల్యాండ్ రికార్డ్ ఏడి శ్రీనివాసులు, ఖమ్మం రెవెన్యూ డివిజన్ అధికారి నరసింహా రావు, తహసిల్దార్ లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అందిస్తున్న.. సేవలు అభినందనీయం

**శ్రీ సత్యసాయి ప్రత్యేక అవసరాల పాఠశాల సందర్శించిన జిల్లా సంక్షేమ అధికారిణి**



**మణుగూరు, మహా :** మణుగూరు మండలం సంతోష్‌నగర్‌లో సింగరేణి సేవా సమితి సహకారంతో సింగరేణి మాజీ ఉద్యోగి తణుకు దుర్గావరప్రసాద్, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ సత్యసాయి ప్రత్యేక అవసరాల (చెవిటిమూగ) పాఠశాలను గురువారం జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనిన్ సందర్శించారు. సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన వసతి, విద్యాబోధన, కళలు, క్రీడలు వంటి విభాగాల్లో చూపుతున్న ప్రతిభ, సాధించిన అవార్డులను అధికారులు పరిశీలించారు. ప్రత్యేకించి స్పీచ్ థెరపీ ద్వారా విద్యార్థులు మాట్లాడే తీరు, వారిలో వచ్చిన పురోగతిని ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనిన్ మాట్లాడుతూ.. ఈ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమైనవని, ఉపాధ్యాయులు చూపుతున్న అంకితభావం శ్లాఘనీయమన్నారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన పలు సూచనలు నిర్వాహకులకు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తెల్లూరి శ్రీనివాసరావు, ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వర్లు, పాఠశాల నిర్వాహకులు టి నాగమణి, దుర్గావరప్రసాద్, ఉపాధ్యాయురాలు రోజా రమణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డీఎఫ్ఓ నివాస గృహంలోకి పాము

**టీం సభ్యులను అభినందించిన డీఎఫ్ఓ కృష్ణ గౌడ్**



**కొత్తగూడెం రూరల్, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ శాఖ వనవిహార్ లోని డీఎఫ్ఓ అధికారిక నివాసంలోకి గురువారం సుమారు 8అడుగుల పాము రావడంతో వెంటనే కుటుంబ సభ్యులు ప్రాణధార ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తగూడెం కార్పొరేషన్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ కు సమాచారం అందించారు. వెంటనే సంతోష్ తో పాటు సభ్యుడు నారదాసు శ్రీకాంత్(చోటు)తో వెళ్లి సాహసోపేతంగా పామును పట్టి బంధించి దానిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ మానవ పర్యావరణ రక్షణ కోసం సాహసం త్యాగం తప్పవు అని పాము పట్టే ప్రతి సారి ఎంతో సమయస్ఫూర్తి ధైర్యం అనుభవం అవసరం అని పేర్కొన్నారు. 16 ఏళ్లుగా మానవ పర్యావరణ రక్షణ కోసం రాత్రి పగలు ఎండ వాన అని తేడా లేకుండా స్నేక్ రెస్క్యూ కోసం కృషి చేస్తున్న సంతోష్‌ను ట్రస్ట్ సభ్యులను డీఎఫ్ఓ కృష్ణ గౌడ్ అభినందించారు.

## ముచ్చర్ల చెక్ పోస్ట్ లో.. పత్తి తేమ మిషన్ ఏర్పాటు

**కారేపల్లి, మహా :** ఇల్లందు మార్కెట్ కమిటీ పరిధిలోని ముచ్చర్ల చెక్ పోస్ట్ వద్ద పత్తి తేమ శాతం కొలుచు మిషన్ ఏర్పాటు చేసినట్లు ఇల్లందు మార్కెట్ కమిటీ కార్యదర్శి నరేష్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి పత్తి రైతుల సౌకర్యార్థం ముచ్చర్ల చెక్ పోస్ట్ నందు ఏర్పాటు చేసిన మార్చర్ మీటర్ ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీఐ లో పత్తి అమ్మటానికి వెళ్ళు రైతులు పత్తి తేమ శాతంను ముచ్చర్ల చెక్ పోస్ట్ వద్ద తనిఖీ చేసుకోవచ్చున్నారు. తేమ శాతం వచ్చిన తర్వాతనే సిసిఐ కేంద్రానికి పత్తిని తీసుకువెళ్లాలని ఆయన కోరారు.

## చంద్రుగొండలో కొత్త ప్రతిపాదనపై ప్రజల్లో ఉత్కంఠ



**అశ్వారావుపేట, అక్టోబర్ 23, మహా :** అశ్వారావుపేట నియోజకవర్గంలో గత సంవత్సరం ఘనంగా శంకుస్థాపన చేసిన మినీ స్టేడియం ప్రాజెక్ట్ ఇప్పటివరకు పూర్తికాలేదు. ప్రారంభం చేసినప్పటికీ, నిర్మాణం ఇప్పటికీ జరగలేదు. క్రీడాకారులు, యువత మరియు స్థానిక ప్రజలు ఈ పరిస్థితి గురించి ఏ స్పష్ట సమాచారం పొందలేక, గందరగోళంలో ఉన్నారు. మునుపటి స్టేడియం ఒక సంవత్సరం గడిచినా, పనులు ఎందుకు నిలిచిపోయాయి? అనే సందేహం పెద్దగా ఉంది. ఈ నేపథ్యంలో, అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్య, క్రీడలు యువజన సేవల శాఖల మంత్రి మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వాకిటి శ్రీహరిని కలిశారు. ఎమ్మెల్యే జారె చంద్రుగొండ మండలంలో కొత్త మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని, అలాగే నియోజకవర్గంలోని శిథిలావస్థలో ఉన్న వెటర్నరీ ఆసుపత్రులకు నూతన భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ప్రజలు, మునుపటి అశ్వారావుపేట మినీ స్టేడియం కేవలం శంకుస్థాపన వరకే ఆగిపోయింది, అది ఎప్పుడు పూర్తికావాలి? ఇప్పుడు చంద్రుగొండలో ప్రతిపాదించిన కొత్త స్టేడియం నిజంగా అమలు అవుతుందా? అని అనిశ్చితి, అనుమానం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు, ప్రభుత్వ ప్రతిపాదనలు వాస్తవంగా క్రీడాకారులకు ఉపయోగపడేలా, స్పష్టతతో అమలు చేస్తారని చూడాలని కోరుతున్నారు.

## 2026 ఖరీఫ్ నాటికి సారునీరు అందేలా.. సీతారామ పాలేరు కెనాల్ పనులు పూర్తి చేయాలి

**- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం,మహా :** 2026 ఖరీఫ్ సీజన్ నాటికి సారునీరు అందించే విధంగా ప్రణాళికతో సీతారామ పాలేరు కెనాల్ టన్నెల్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, తిరుమలాయపాలెం మండలంలోని బీరోలు, దమ్మాయిగూడెం లలో జరుగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు 16వ ప్యాకేజీ లోని పాలేరు లింకు కెనాల్ టన్నెల్ పనులను గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 2026 ఖరీఫ్ నాటికి గోదావరి, మున్నేరు జలాలను మన ప్రాంత రైతులు వినియోగించుకునే విధంగా చేపట్టిన ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తూ పనులు వేగవంతంగా అయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 8.2 కిలోమీటర్ల సొరంగం తవ్వకం పనులకు గాను ప్రతిరోజు 24 మీటర్ల మేర పనులు చేపట్టి ఇప్పటి వరకు నాలుగు కిలోమీటర్ల పనులు పూర్తి చేయడం జరిగిందని, మిగిలిన టన్నెల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా పోచారం వద్ద పెండింగ్ ఉన్న భూ సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఎస్ఇ యం. వెంకటేశ్వర్లు, డిఇ రమేష్ రెడ్డి, తిరుమలాయపాలెం మండల తహసీల్దారు విల్సన్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

Follow: @ANNTELUGU
24-10-2025
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 318 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## మా నినాదం మేడిన్ ఇండియా కాదు.. ఇన్వెంట్ ఇన్ తెలంగాణ

### గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ

2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే లక్ష్యం

కొత్తగా రూ.లక్ష కోట్ల పెట్టుబడులు, 5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తాం

'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో ప్రసంగించిన మంత్రి శ్రీధర్ బాబు

**మెల్‌బోర్న్:** లైఫ్ సైన్సెస్‌లో 2030 నాటికి కొత్తగా రూ.లక్ష కోట్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి 5 లక్షల మందికి ఉపాధి కల్పించేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లుగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్‌బయోటెక్', విక్టోరియా రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో మెల్‌బోర్న్‌లో నిర్వహిస్తున్న 'ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025'లో ఆయన గురువారం కీలకోపన్యాసం చేశారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



### రాజీనామా చేస్తా...
- పోచారం శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు
- నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

02



### మాదంతా ఒకే కుటుంబం
- సీఎం రేవంత్‌కు క్షమాపణ చెప్పిన కొండా సురేఖ

02



### అర డజను పిల్లలతో...
- సంతోషంగా ఉండు
- ప్రభాస్ కు మోహన్ బాబు విషెస్

02



### జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు సున్నా..
- ప్రజలు మీకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం
- ఫ్యామిలీ తగాదాలు పరిష్కరించుకోలేనిది మాపై విమర్శలా?
- మాజీ మంత్రి కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్

02



### బీజేపీకి బీటీమ్‌గా బీఆర్ఎస్

మంత్రి సీతక్క ఇంటింటి ప్రచారం

వివరాలు 2లో

# కేటీఆర్.. కడుపుకు అన్నం తింటున్నావా?

## నిజాయితీగా పనిచేస్తే బట్ట కాల్చి మీదేస్తారా?

అవినీతి.. నిర్లక్ష్యపు అధికారిని వెనకేసుకొస్తారా?

ఇదిగో ఆధారాలు.. సమాధానం చెప్పు

రెండేళ్ళుగా ఆయన మీ పాపాలనే మోస్తున్నాడు

రిజ్వీతో సర్కారుకు రూ.230 కోట్ల నష్టం.. అఖిల భారత సర్వీస్ రూల్స్ నూ ధిక్కరించాడు

ఆయన నిర్లక్ష్యపు పనిపై.. ఏడాదికాలంలో ఉన్నత అధికారులకు అనేక లేఖలు రాశా

లిక్కర్ దందాకు పేటెంట్ కల్వకుంట్ల కుటుంబమే.. ముఖ్యమంత్రిపై, మాపై నిందలు వేస్తారా?

తప్పు చేయను.. నీతి తప్పను.. మీలాగా కాదు

మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలనం



**హైదరాబాద్, మహా:** కేటీఆర్ కడుపుకు అన్నం తింటున్నావా? నిజాయితీగా పనిచేసే నాపై జూబ్లీహిల్స్ ఎన్నికలున్నాయని బట్ట కాల్చి మీదేస్తారా? ఆరోపణలు చేయడానికి మనస్సాక్షి.. సిగ్గు ఉండాలి కదా? మీరు చెప్పే నిజాయితీ గల అధికారి రెండేళ్ళుగా ఏ నిర్వాకాలు చేశారో మీకు తెలుసా? హోలోగ్రామ్ కారణంగా నకిలీమద్యానికి ఆస్కారం ఉండడంతో నామినేషన్ పద్ధతిపై స్వంత నిర్ణయాలతో ఏడాదికి 40కోట్ల టెండర్లను కొనసాగిస్తున్న విషయం తెలుసా? ప్రభుత్వ ఆదేశాలు, చర్యలన్నీ తొక్కిపెట్టి.. అఖిల భారత సర్వీసు రూల్స్ నిబంధనలకు విరుద్ధంగా పనిచేసిన విషయం మీకు తెలుసా? రిజ్వీ అనేక తప్పిదాలకు పాల్పడ్డాడు.

మిగతా 2లో

### నవంబర్ 7న స్థానిక ఎన్నికలపై నిర్ణయం
- ప్రతిపక్షాల దుష్ప్రచారం తిప్పికొడదాం
- సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ

వివరాలు 2లో

# ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతా..

## ఏపీలో మూడు, తమిళనాడులో రెండు, కేరళలో గల్లీకో పార్టీ ఉంది

పార్టీలు ఉండటం పెద్ద విషయం కాదు.. ప్రజలకు మేలు జరగాలి

రేపు నిజామాబాద్ నుంచి జనం బాట

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శనం



**యాదాద్రి, మహా:** ప్రజలు కోరుకుంటే తప్పకుండా తాను రాజకీయ పార్టీ పెడతానని, పార్టీ పెడితే తనకు కాదని.. ప్రజలకు మేలు జరగాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం ఆమె యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో కవిత మాట్లాడారు. రాజకీయ పార్టీ ఏర్పాటుపై ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ జాగృతి సివిల్ సొసైటీ సంస్థ అయినప్పటికీ అవసరమైతే రాజకీయాల గురించి తాను పుష్కలంగా మాట్లాడతానని చెప్పుకొచ్చారు. రాజకీయాల గురించి తెలంగాణ జాగృతి తరఫున మాట్లాడాలంటే రాజకీయ పార్టీగానే ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పార్టీ రావాలని ప్రజలు కోరుకుంటే తప్పకుండా వస్తానని... అందులో ఇబ్బందేమీ లేదని పేర్కొన్నారు.

మిగతా 3లో

### బిజెపి ఆందోళన .. ఉద్రిక్తత

గోరక్షక్ కార్యకర్త మీద కాల్పుల ఘటనపై సీరియస్

వివరాలు 3లో



### ఆ రెండు పార్టీలు జూబ్లీహిల్స్ కు ఏం చేయలే

బీఆర్ఎస్, కాంగ్రెస్ లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్

**జూబ్లీహిల్స్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , ఎమ్మెల్యే అభ్యర్థి లంకల దీపక్ తో కలిసి వెంగల్ రావు నగర్ డివిజన్, మధురానగర్‌లో ఇంటింటి ప్రచారం

మిగతా 2లో



## జూబ్లీహిల్స్‌లో విజయం మనదే

బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో కేసీఆర్... ప్రభుత్వ వైఫల్యాలు ప్రచారం చేయాలని సూచన

**గజ్వేల్, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మాగంటి సునీత గోపీనాథ్ గెలుపును ప్రజలు ఇప్పటికే ఖాయం చేశారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతలు ప్రజల వద్దకు వెళ్లి వారితో మమేకమై కాంగ్రెస్ దుష్ట పాలన పట్ల మరింత అవగాహన కల్పించి భారీ మెజారిటీ కోసం గట్టి ప్రయత్నం చేయాల్సి ఉన్నదని పార్టీ నేతలకు పునరుద్ఘాటించారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ దోపిడీ పాలనతో ఇప్పటికే రాష్ట్రం గుల్ల గుల్ల అయ్యిందని, ఇక జూబ్లీహిల్స్‌లో

మిగతా 2లో

## బాలకృష్ణ తాగి అసెంబ్లీకి వచ్చాడు

### జగన్ సంచలన వ్యాఖ్యలు

గూగుల్ క్రెడిట్ మాదే.. అది మా పునాదే

అదానీ వల్లే ఇది సాధ్యమైంది.. క్రెడిట్ ఇవ్వడం బాబుకు నచ్చదు



**అమరావతి, మహా:** "బాలకృష్ణ తాగి వచ్చి అసెంబ్లీలో మాట్లాడారు. తాగిన వ్యక్తిని అసెంబ్లీకి ఎలా అనుమతిచ్చారు?" అని వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. బాలకృష్ణ చేసిన సంభాషణలు 'పనీపాట లేనివి' అని, "అసెంబ్లీలో మాట్లాడాల్సింది ఏంటి? ఆయన మాట్లాడిందేంటి?" అని నిలదీశారు. దీని ద్వారా బాలకృష్ణ మానసిక పరిస్థితి ఏంటో అర్థమవుతోంది అంటూ

మిగతా 2లో

## బీహార్‌లో ఆర్జేడీదే హవా

ప్రత్యేక కథనం 4లో





# రాజీనామా చేస్తా

**పోచారం శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు**

నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు

**కామారెడ్డి, మహా :** మాజీ సభాపతి, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బాన్సువాడ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్ రెడ్డిని కలిసినట్లు చెప్పారు. నా స్వార్థం కోసం కలిసి ఉంటే చెప్పుతో కొట్టండి అని కీలక వ్యాఖ్యలు చేశారు. అవసరం అయితే రాజీనామాకు కూడా తాను సిద్ధమే అని ప్రకటించారు. ప్రజలకు హానీ కలిగించే పని జీవితంలో చేయబోను అని అన్నారు. ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లో కొనసాగుతున్నానని చెప్పారు. ప్రజలే నా కుటుంబసభ్యులుగా భావిస్తానని అన్నారు. ఉన్నంతకాలం ఇలాగే జీవిస్తా అని స్పష్టం చేశారు. కానీ కొంతమంది కావాలనే నా మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఏదో ఆశించి సీఎం రేవంత్ రెడ్డిని కలిశానని నెగిటివ్‌గా నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వ్యక్తిగతంగా నా కోసం ఇప్పటివరకు సీఎం రేవంత్‌ని ఏదైనా అడిగినట్లు నిరూపిస్తే క్షణం ఆలోచించకుండా రాజీనామా చేస్తానని పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీ నుంచే పోటీ చేసి గెలిచానని వెల్లడించారు.



# మాదంతా ఒకే కుటుంబం

**సీఎం రేవంత్‌కు క్షమాపణ చెప్పిన కొండా సురేఖ**

**హైదరాబాద్, మహా:** మంత్రుల మధ్య విభేదాలు లేవని, తమదంతా ఒకే కుటుంబమని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ క్షమాపణలు చెప్పారు. గురువారం సాయంత్రం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తమ ఇంటికి పోలీసులు రావడంతో కూతురు సుష్మిత ఆవేశంతో మాట్లాడింది. మా కూతురు తరపున నేను క్షమాపణ అడుతున్నాను. ప్రస్తుతం మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు.. త్వరలోనే అన్నీ సమసిపోతాయని కొండా సురేఖ స్పష్టం చేశారు. తామంతా కాంగ్రెస్ గొడుగు కిందే కుటుంబంలా పనిచేస్తామన్నారు.

# బాలకృష్ణ తాగి అసెంబ్లీకి వచ్చాడు

**జగన్ సంచలన వ్యాఖ్యలు.. గూగుల్ క్రెడిట్ మాదే.. అది మా పునాదే..**

అదానీ వల్లే ఇది సాధ్యమైంది.. క్రెడిట్ ఇవ్వడం బాబుకు నచ్చదు

(మొదటిపేజీ తరువాయి)





ఆయన ఆరోగ్య పరిస్థితిపై అనుమానాలు వ్యక్తం చేశారు. నకిలీ మద్యం గురించి ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నందమూరి బాలకృష్ణపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బాలకృష్ణ అసెంబ్లీలో ప్రవర్తించిన తీరును, ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, ఘాటు విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా, తాగిన వ్యక్తిని అసెంబ్లీలోకి అనుమతించినందుకు స్పీకర్‌పైనా జగన్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "తాగిన వారిని అసెంబ్లీలోకి అనుమతించిన స్పీకర్‌కు బుద్ధి లేదు," అంటూ వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ఆ విధంగా మాట్లాడుతున్నారు అంటే, బాలకృష్ణ సైకలాజికల్ హెల్త్ ఎలా ఉందో చూసుకోవాలి అని జగన్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో, సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**గూగుల్ క్రెడిట్ మాదే.. అది మా పునాదే**

ఇక యాడ్ ఏజెన్సీల రాష్ట్ర ప్రభుత్వ పాలన అని మాజీ సీఎం జగన్ విమర్శించారు.. మాటలు చూస్తే కోటలు దాటుతున్నాయి.. పెర్ఫార్మెన్స్ మాత్రం వీక్ అన్నారు.. వేరే వాళ్ళకు దొరకాల్సిన క్రెడిట్ చోరీలో మాత్రం చంద్రబాబు పీక్ అని విమర్శించారు.. గత ప్రభుత్వ హయాంలో ఇంటర్నేషనల్ హబ్ గా విశాఖను తీర్చిదిద్దే పనిలో భాగంగా అదానీ డేటా సెంటర్‌కు బీజం పడిందని తెలిపారు. సింగపూర్ నుంచి సబ్సీ కేబుల్ తీసుకువచ్చే కార్యక్రమానికి అంకురార్పణ కూడా అప్పుడే జరిగిందని చెప్పారు.. సబ్సీ కేబుల్ తీసుకు రాకపోతే ఏ డేటా రాదని.. అదానీ డేటా సెంటర్ కు ఫౌండేషన్ వేయటం వల్లే ఇది సాధ్యమైందన్నారు.. ఇది జరగటానికి వైసీపీ, అదానీ, కేంద్రం, సింగపూర్ చేసిన కృషి వల్లే ఇవాళ గూగుల్ విశాఖ వచ్చిందని కొనియాడారు.. ఆరోజు వైసీపీ కృషి వల్లే ఇప్పుడు గూగుల్ రావటానికి మార్గమైందని వెల్లడించారు. అదానీ పెట్టిన ప్రాజెక్టుకు ఇది విస్తరణ.. అక్టోబర్ 2022 నుంచి అదానీకి.. గూగుల్ కు బిజినెస్ రిలేషన్ షిప్ ఉందని మాజీ సీఎం వైఎస్ జగన్ తెలిపారు.. ఈ నేపథ్యంలోనే విశాఖలో మే 2023 లో ఫౌండేషన్ స్టోన్ వేశామన్నారు.. సబ్సీ కేబుల్ కు అంకురార్పణ కూడా అప్పుడే జరిగిందని తెలిపారు. సముద్ర గర్భంలో సింగపూర్ నుంచి విశాఖ వరకు అదానీ సబ్సీ కేబుల్ వేయటం వల్లే గూగుల్ వచ్చిందని మాజీ సీఎం జగన్ వివరించారు.. ఆ రెండు కంపెనీలు వ్యాపార భాగస్వాములు కాబట్టే డేటా సెంటర్ విశాఖ వచ్చిందన్నారు.. 300 మెగావాట్ల డేట్ సెంటర్ కు అప్పుడు వైసీపీ వేసిన అడుగుల వల్లే సాధ్యమైందన్నారు..

**అదానీకి థ్యాంక్స్ చెప్పారా.. హైదరాబాద్ ది కూడా సేమ్ స్టోరీ**

"అదానీ ఇన్ఫ్రా కు సంబంధించిన వాళ్ళే ఈ డేటా సెంటర్ నిర్మిస్తున్నారు.. గూగుల్ నుంచి అలెగ్జాండర్ స్మిత్ ఐటీ సెక్రటరీ గా ఉన్న భాస్కర్ కు ఓ లెటర్ కూడా రాశారు.. అదానీ కి చెందిన మూడు కంపెనీలకు ల్యాండ్ అలాట్ చేయాలని కోరారు.. ఈ ప్రాజెక్ట్ తేవటం కోసం 87 వేల కోట్లు అదానీ ఖర్చు చేసి గూగుల్ ని తీసుకువస్తునారు.. అదానీ 10 మిలియన్ డాలర్లు ఖర్చు చేస్తేనే గూగుల్ వస్తుంది.. ఇలాంటి డేటా సెంటర్ అదానీ లాంటి మన దేశీయ కంపెనీ పెడుతుందని గర్వంగా చెప్పుకోవాలి.. క్రెడిట్ ఎవరికి ఇవ్వాలి.. కనీసం అదానీ కి ఒక థాంక్స్ అయినా చెప్పారా.. ఇదంతా చెప్తే జగన్ ప్రభుత్వం లోనే జరిగిందని క్రెడిట్ ఇవ్వడం చంద్రబాబు కు ఇష్టం లేదు.. డేటా సెంటర్ లో అతిముఖ్యమైన అంశం సముద్ర గర్భంలో వేస్తున్న కేబుల్.. 3900 కిలోమీటర్ల మేరా కేబుల్ వేయాలి.. అంతా పూర్తయిన తర్వాత చంద్రబాబు సుందర ముఖారవిందాన్ని చూసి వీళ్ళు వచ్చినట్లు చెప్పుకుంటున్నారు.. గతంలో 300 మెగావాట్ల డేటా సెంటర్ కోసం భూ కేటాయింపులు చేశాం.. ప్రపంచాన్ని శాసించబోయే టెక్నాలజీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్.. వీటికి డేట్ సెంటర్ కీ ఫ్యాక్టర్ గా పనిచేస్తుంది.. 300 మెగావాట్ల డేటా సెంటర్ పెడితే 25 వేల ఉద్యోగాలు ఇవ్వాలని కోరాం.. ఐటీ పార్క్, స్కిల్ యూనివర్సిటీ పెట్టాలని కోరాం.. చంద్రబాబు ఇలా చేయటం కొత్త కాదు.. హైదరాబాద్ విషయంలో కూడా చంద్రబాబుది సేమ్ స్టోరీ.. మాదాపూర్ సైబర్ టవర్స్ ఆరెకరాల స్థలంలో వచ్చిన చిన్న ప్రాజెక్ట్.. దీనికి పునాది రాయి వేసింది ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్ జనార్దన్ రెడ్డి.. ఆ తర్వాత ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు దాన్ని ప్రైవేట్ వాళ్లకు ఇచ్చి కట్టించాడు.. ఆ బిల్డింగ్ ఒకటి కట్టి హైదరాబాద్ మొత్తం నేనే కట్టాను అని ప్రొజెక్షన్ చేసుకున్నాడు.. 2004, 2009 వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిచారు.. 2014, 2019 లో కేసీఆర్ గెలిచాడు.. అయిన ఈ 20 ఏళ్ల అభివృద్ధి నాదే అంటాడు.. ఒక్క బిల్డింగ్ కట్టి అభివృద్ధి మొత్తం నాదే అనటం మూర్ఖత్వం.. వైఎస్ఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఓఆర్ఆర్, పీవీ ఎక్స్ ప్రెస్ హైవే, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఇవన్నీ వచ్చాయి కాబట్టే హైదరాబాద్ అంతలా అభివృద్ధి చెందింది.. ఐటీ ఎక్స్పోర్ట్స్ కూడా చంద్రబాబు దిగిపోయిన తర్వాత భారీగా పెరిగాయి.. 2009 నాటికి 5600 కోట్ల నుంచి 39 వేల కోట్లకు ఐటీ ఎగుమతులు దాటాయి.. 2014 నాటికి 56 వేలకోట్లు దాటాయి.. వేరే వాళ్ళు చేస్తే ఆ క్రెడిట్ వాళ్లకు ఇవ్వాలి.. కేసీఆర్ వచ్చిన తర్వాత గొప్ప పరిపాలన చేశారు కాబట్టే అభివృద్ధి సాధ్యం అయ్యింది.. కేసీఆర్ 2 లక్షల కోట్లకు పైగా ఐటీ ఎగుమతులు తీసుకువెళ్ళారు.. 2004 లో పాలన వదిలేసి ఇప్పటికీ అంతా నేనే వేశా అని చెప్పుకునే చంద్రబాబు.. విశాఖ దేశంలోని ఇతర మెట్రో నగరాలను తలదన్నేలా అడుగులు వేశాం.. భోగాపురం ఎయిర్ పోర్టు కు మేమే అన్నీ చేశాం.. మరో ఏడాదిలో పూర్తి కూడా అవుతుంది.. ఉత్తరాంధ్ర దశ దిశ మార్చటం కోసం పోర్టు నిర్మాణం చేపట్టాం.." అని మాజీ సీఎం జగన్ వ్యాఖ్యానించారు.

# మా నినాదం మేడిన్ ఇండియా కాదు.. ఇన్వెంట్ ఇన్ తెలంగాణ

**గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ**

2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలన్నదే లక్ష్యం

కొత్తగా రూ.లక్ష కోట్ల పెట్టుబడులు, 5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తాం

‘ఆస్‌బయోటెక్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ 2025’లో ప్రసంగించిన మంత్రి శ్రీధర్ బాబు

(మొదటిపేజీ తరువాయి)



రెండేళ్లలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం సాధించిన పురోగతి, భవిష్యత్తు ప్రణాళికలు, అవకాశాలు, పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. తెలంగాణను "గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్"గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను మంత్రి వెల్లడించారు. భౌగోళికంగా 11వ స్థానం, జనాభాలో 12వ స్థానంలో ఉన్నప్పటికీ, దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో తెలంగాణ వాటా 5 శాతం కంటే ఎక్కువగా ఉందని మంత్రి శ్రీ శ్రీధర్ బాబు తెలిపారు. 20242025లో తెలంగాణ జీఎస్ డీపీ వృద్ధి రేటు 8.2 శాతం కాగా, జాతీయ సగటు కేవలం 7.6 శాతం మాత్రమే ఉందన్నారు. గత 20 నెలల కాలంలో కొత్తగా రూ.3.2 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాగా, ఇందులో లైఫ్ సైన్సెస్ రంగం వాటా రూ.63వేల కోట్లు అని చెప్పారు. లైఫ్ సైన్సెస్ ఎగుమతులు గతేడాది ఏప్రిల్ -డిసెంబర్ మధ్య కాలంలోనే రూ.26వేల కోట్ల మార్కును దాటాయన్నారు.

**త్వరలోనే కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ..**

తెలంగాణ లైఫ్ సైన్సెస్ రంగం ఆర్థిక వ్యవస్థ విలువను ప్రస్తుతం ఉన్న 80 బిలియన్ డాలర్ల నుంచి 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం త్వరలోనే "కాంప్రహెన్సివ్ లైఫ్ సైన్సెస్ పాలసీ"ని అందుబాటులోకి తెస్తామన్నారు. మా నినాదం మేడిన్ ఇండియా కాదు... ఇన్వెంట్ ఇన్ తెలంగాణ అని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ పరిశ్రమల ఏర్పాటుకు అనువైన "ఎకో సిస్టం" తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తుందన్నారు. జీనోమ్ వ్యాలీ, మెడికల్ డివైసెస్ పార్క్, బీ హబ్, భారత్ ఫ్యూచర్ సిటీ, పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించే ప్రగతిశీల, ప్రోత్సాహకర విధానాలు, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, ప్లగ్అండ్‌ప్లే పారిశ్రామిక పార్కులు, అనుమతుల కోసం సింగిల్ విండో సిస్టమ్, దేశంలోనే సాటి లేని స్టెమ్ టాలెంట్, స్థిరమైన ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం, ఎక్కడైనా సులభంగా చేరుకునేలా రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో విక్టోరియా రాష్ట్ర మంత్రులు రోస్ స్పెన్స్, డానీ పియర్సన్ ఎంపీ, ఆస్ బయోటెక్ ఛైర్మన్ డా. జేమ్స్ క్యాంప్‌బెల్, తెలంగాణ ఇన్వెస్ట్మెంట్ సెల్ డైరెక్టర్ మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈవో శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్.. కడుపుకు అన్నం తింటున్నావా?

(మొదటిపేజీ తరువాయి)

డిస్టిలరీల విషయంలో నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి ఏడాదికి రూ.230కోట్ల నష్టం వాటిల్లింది. ఇంకా నష్టం జరుగుతోంది. ఒకటి కాదు.. పదుల నిర్లయాలు ప్రజాధనానికి గండిపెట్టినవి.. పాత ప్రభుత్వంలోని దందాలు కొనసాగించినవి అంటూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం రాత్రి మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్ తదితరులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రిజ్వీ పనితీరుపై గత ఏడాది ఆగస్టు నుండి లేఖలు రాస్తున్నానని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని, కమిటీ వేసి ఛైర్మన్ పదవి అప్పగించినా ఏనాడూ విధులు నిర్వర్తించలేదన్నారు. అలాంటపుడు ఉన్నతాధికారికి లేఖలు రాశామన్నారు. తమ లేఖ వల్ల ఆయన ఉద్యోగానికి రాజీనామా చేయలేదని, ఎక్కువ జీతం వస్తుందని ప్రైవేట్ ఉద్యోగం చూసుకున్నాడన్నారు. గత నెల 11వ తేదీన తాను సీఎస్ కు లేఖ రాశానని, ఇపుడు కొత్తగా రాసింద కాదన్నారు. అపుడే వీఆర్ఎస్ కు దరఖాస్తు చేస్తున్నారని తెలిసి.. ఇలాంటి నిర్లక్ష్యపు అధికారులపై విచారణ జరగాలని రాశానన్నారు. తాను తప్పుచేయనని, నిజాయితీగా ఉంటానని.. ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధమన్నారు. తాను ఏడుసార్లు గెలిచానని, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్, ప్రస్తుతం రేవంత్ రెడ్డి మంత్రివర్గాల్లో మంత్రిగా ఉన్నానన్నారు. తాను నిజాయితీగా ఉంటానని, ఎపుడూ అబద్ధం చెప్పనని, అబద్ధపు హామీలు ఇవ్వనన్నారు.

**జూబ్లీహిల్స్ ఎన్నికలు ఉన్నాయని..**

జూబ్లీహిల్స్ ఎన్నికలు వచ్చాయని, సంబంధం లేని అంశాన్ని తీసుకొచ్చి ఈ వ్యవహారాలతో సంబంధం లేని ముఖ్యమంత్రి పైన, ఆయన కుటుంబం పైన, తన కుటుంబం పైనా చిల్లర ఆరోపణలు చేస్తున్నారని మంత్రి జూపల్లి మండిపడ్డారు. లిక్కర్ దందాకు పేటెంట్ కల్వకుంట్ల కుటుంబమేనని, ఢిల్లీలో అరెస్టయి.. బిజెపి దగ్గర మోకరిల్లి ఏం చేసి వచ్చారో అందరికీ తెలుసన్నారు. తెలంగాణ రాకముందు కేసీఆర్, కేటీఆర్, హరీష్, కవిత, సంతోష్ ల ఆర్థిక స్థితి ఏంటి.. ఇపుడు ఏంటి అన్న విషయం ప్రజలకు తెలుసునని, చెప్పాలంటే వందలున్నాయని.. విధులపై నిర్లక్ష్యం వహించేవారిని ప్రశ్నిస్తే అడ్డగోలు ఆరోపణలు చేస్తే మంచిదికాదన్నారు. తాను నిజాయితీగా ఉంటాను కాబట్టి పిచ్చి ఆరోపణలకు బాధపడుతున్నానని, ఇలాంటి ఆరోపణలు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

# బీజేపీకి బీటీమ్‌గా బీఆర్ఎస్

**మంత్రి సీతక్క ఇంటింటి ప్రచారం**

**జూబ్లీహిల్స్:** కాంగ్రెస్‌కు వస్తున్న ప్రజాస్పందన ఓర్వలేక బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి సీతక్క ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని మంత్రి సీతక్క ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మీడియాతో మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని అన్నారు. గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను ఆశీర్వదించాలని కోరారు. తమ ప్రచారానికి మంచి ప్రజా స్పందన వస్తుందని, ప్రజా స్పందన చూస్తుంటే నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయం అని జోస్యం చెప్పారు. నవీన్ యాదవ్ గెలుపు లాంచనమేనని, బీజేపీకి బీ టీమ్ గా బీఆర్ఎస్ పని చేస్తుందని ఆరోపించారు. ఇక జూబ్లీహిల్స్ గల్లీలో పుట్టి పెరిగిన యువకుడు నవీన్ యాదవ్ కు ఒక అవకాశం ఇవ్వాలని ఓటర్లకు మంత్రి విజ్ఞప్తి చేశారు.

# జూబ్లీహిల్స్‌లో విజయం మనదే

**బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో కేసీఆర్...**

**ప్రభుత్వ వైఫల్యాలు ప్రచారం చేయాలని సూచన**

(మొదటిపేజీ తరువాయి)

తన అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ఓ రౌడీషీటర్‌ను నిలబెట్టి హైదరాబాద్ ప్రజల విజ్ఞతకు కఠిన పరీక్ష పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. విజ్ఞులైన జూబ్లీ హిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన రౌడీషీటర్ ఫ్యామిలీ నుంచి వచ్చిన అభ్యర్థిని చిత్తుగా ఓడించి, జూబ్లీహిల్స్ గౌరవాన్ని హైదరాబాద్‌లో శాంతి భద్రతలను కాపాడుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవెల్లిలో సన్నాహక సమావేశం జరిగింది.

**హాజరైన పార్టీ కీలక నేతలు**

ఈ సమావేశంలో పోటీలో ఉన్న అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ సహా, ఉప ఎన్నిక కోఆర్డినేటర్లుగా ఉన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పార్టీ సీనియర్ నేతలు మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు... హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ మహమూద్ అలీ, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, జి జగదీశ్ రెడ్డి, లక్ష్మారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, చామకూర మల్లారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, పాల్గొన్నారు. వీరితో పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల, క్లస్టర్ల ఇంచార్జులు పాల్గొన్నారు. వారిలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు, ముఖ్య నేతలు, స్థానిక కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, తదితర పార్టీ కీలక నేతలు పాల్గొన్నారు.

**ఇప్పుడు ఎందుకు మాయమయ్యాయి..?**

ఈ సమావేశం సందర్భంగా పార్టీ అభ్యర్థి గెలుపు దిశగా ఇప్పటికే ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతున్న నేపథ్యంలో... క్షేత్రస్థాయిలో ఇప్పడిదాకా కొనసాగుతున్న ప్రచారం సంబంధిత అంశాల మీద అధినేత కు ఇంచార్జీలు రిపోర్ట్ చేశారు. పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ భారీ మెజారిటీతో గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహాలు ఎత్తుగడలు, కార్యాచరణకు సంబంధించి, అధినేత కేసీఆర్ సమావేశంలో సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో రాష్ట్రంలో దిగజారిన అభివృద్ధి గురించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో తలెత్తిన ప్రమాదకర పరిస్థితులను గురించి వారికి ఇంటింటికీ తిరిగి వివరించాలని పార్టీ నేతలకు అధినేత కేసీఆర్ ఉద్బోధించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనాకాలంలో అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, మానవీయ కోణంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎందుకు మాయమయ్యాయనే విషయాన్ని ప్రజలతో కలిసి చర్చించాలని అధినేత కేసీఆర్ సూచించారు.

# నవంబర్ 7న స్థానిక ఎన్నికలపై నిర్ణయం

ప్రతిపక్షాల దుష్ప్రచారం తిప్పికొడదాం

సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ

**హైదరాబాద్, మహా :** తెలంగాణ మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రధానంగా స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లపై చర్చించారు. ఇటీవల కాలంలో మంత్రుల మీద అనవసరంగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లపై నవంబర్ 3న హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై నవంబర్ 7న మరోసారి కేబినెట్ భేటీ నిర్వహిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఆర్డినెన్స్‌ను త్వరలోనే గవర్నర్ కు పంపనున్నట్లు వెల్లడించారు. మంత్రులందరూ అపోహలకు తావులేకుండా ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు.

# జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు సున్నా..

**ప్రజలు మీకు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయం**

ఫ్యామిలీ తగాదాలు పరిష్కరించుకోలేనిది మాపై విమర్శలా?

మాజీ మంత్రి కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్



**నిజామాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ నిరంకుశ పాలనను ప్రజలు మర్చిపోలేదని, బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కుటుంబ తగాదాలు పరిష్కరించుకోలేని కేటీఆర్.. కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని, ముందు కవిత మాటలకు కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. గురువారం నిజామాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలో ఉండగా బీఆర్ఎస్ ఆరాచక పాలన చేసింది కాబట్టే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించారని, పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారని రేపు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కూడా సున్నా రాబోతోందన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు బీఆర్ఎస్‌కు కర్రుకాల్చి వాత పెట్టబోతున్నారని చెప్పారు. అన్ని ప్రాంతాలను ఈ ప్రభుత్వం సమానంగా చూస్తోందని, పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ చెప్పుకోదగ్గ కార్యక్రమం ఏదైనా చేసిందా అని ప్రశ్నించారు. నిజామాబాద్ ను మరింత అభివృద్ధి చేస్తామని, రైల్వే ఓవర్ బ్రిడ్జి కోసం కేంద్రం నిధులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పాదయాత్రలు చేసినా స్వాగతిస్తామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈనెల 25 నుంచి జాగృతి జనం బాట పేరుతో కవిత రాష్ట్రవ్యాప్త పర్యటన చేయబోతున్న నేపథ్యంలో మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ప్రజాసమస్యలపై కవిత పాదయాత్ర చేయడం సంతోషం అన్నారు. అయితే పదేళ్లపాటు తెలంగాణను దోచుకున్న ముఠాలో కవిత లేరా అని ప్రశ్నించారు. కేబినెట్ లో మైనారిటీకి అవకాశం ఉంటుందన్నారు.



ఆ రెండు పార్టీలు జూబ్లీహిల్స్ కు

# ఏం చేయలే

**బీఆర్ఎస్, కాంగ్రెస్ లపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఫైర్**

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. గత 10 సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం, రెండేళ్ల నుంచి ఉన్న కాంగ్రెస్ సర్కార్ జూబ్లీహిల్స్ కి చేసింది ఏమి లేదని, బీజేపీ తోనే అభివృద్ధి అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అనంతరం యూసుఫ్‌గూడా డివిజన్‌లోని వెంకటగిరి లో పాదయాత్రలో పాల్గొని వెంకటగిరి పరిసర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

# నవంబర్ 7న స్థానిక ఎన్నికలపై నిర్ణయం

**ప్రతిపక్షాల దుష్ప్రచారం తిప్పికొడదాం.. సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ భేటీ**

హైదరాబాద్, మహా: తెలంగాణ మంత్రివర్గ సమావేశం గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ప్రధానంగా స్థానిక ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లపై చర్చించారు. ఇటీవల కాలంలో మంత్రుల మీద అనవసరంగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశం అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీసీలకు 42% రిజర్వేషన్లపై నవంబర్ 3న హైకోర్టు తీర్పు వెలువడిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై నవంబర్ 7న మరోసారి కేబినెట్ భేటీ నిర్వహిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఆర్డినెన్స్‌ను త్వరలోనే గవర్నర్ కు పంపనున్నట్లు వెల్లడించారు. మంత్రులందరూ అపోహలకు తావులేకుండా ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు.

# అర డజను పిల్లలతో సంతోషంగా ఉండు

**ప్రభాస్‌కు మోహన్ బాబు విషెస్**

**హైదరాబాద్, మహా:** రెబెల్ స్టార్ ప్రభాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా కలెక్షన్ కింగ్ మోహన్ బాబు చేసిన బర్త్‌డే విషెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోహన్ బాబు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. "మై డియర్ డార్లింగ్ బావా".. "నువ్వు సినీ జాతి మొత్తానికి ఒక గర్వకారణం," అంటూ ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రభాస్ పెళ్లి గురించి మోహన్ బాబు ఫన్నీగా ప్రస్తావించారు. నువ్వు త్వరగా పెళ్లి చేసుకుని, నీకు అరడజన్ నుంచి ఏకంగా ఒక డజన్ మంది పిల్లలు కూడా కలగాలని.. సంతోషమైన జీవితాన్ని గడపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఎప్పటికీ ఈ బావ నిన్ను ప్రేమిస్తూనే ఉంటాడు" అని పేర్కొన్నారు. మోహన్ బాబు చేసిన ఈ సరదా వ్యాఖ్యలు నెట్టింట ఫన్నీ కామెంట్స్‌కు దారి తీశాయి.

# ప్రజలు కోరుకుంటే పార్టీ పెడతా..

## ఏపీలో మూడు, తమిళనాడులో రెండు, కేరళలో గల్లీకో పార్టీ ఉంది

పార్టీలు ఉండటం పెద్ద విషయం కాదు.. ప్రజలకు మేలు జరగాలి

రేపు నిజామాబాద్ నుంచి జనం బాట

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామిని దర్శనం



(మొదటిపేజీ తరువాయి)

ఏపీలో మూడు, తమిళనాడులో రెండు ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని తెలిపారు. కేరళలో గల్లీకి ఒక పార్టీ ఉందని గుర్తుచేశారు. పార్టీలు ఉండటం పెద్ద విషయం కాదని... ఆయా పార్టీలతో ప్రజలకు మేలు జరగాలని సూచించారు. తాను చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజాభిప్రాయం తెలుసుకోవటానికే 'జనం బాట' కార్యక్రమం నిర్వహిస్తున్నానని కవిత తెలిపారు. రేపటి నుంచి 4నెలల పాటు 'జనం బాట' కార్యక్రమం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటానని వెల్లడించారు. 'జనం బాట' కార్యక్రమానికి లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సుల కోసమే తాను ఇక్కడకి వచ్చానని చెప్పుకొచ్చారు. మొన్న తిరుపతి, ఇప్పుడు యాదాద్రి దేవాలయాలను దర్శించుకున్నానని తెలిపారు.

### ప్రతి జిల్లాలో రెండు రోజుల పాటు ఉంటా..

ప్రజా సమస్యలను అర్థం చేసుకునే శక్తి దేవుడు తనకు ఇవ్వాలనే దైవ దర్శనం చేసుకుంటున్నానని కవిత వివరించారు. ఈ నెల 25వ తేదీన తమ సొంతూరు నిజామాబాద్ నుంచి 'జనం బాట' కార్యక్రమం ప్రారంభిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమం 33జిల్లాల్లో 4నెలలు పాటు జరుగుతుందని వివరించారు. తాను ప్రతి జిల్లాలో రెండు రోజుల పాటు ఉంటానని.. అక్కడి సమస్యలు తెలుసుకుంటానని చెప్పుకొచ్చారు. మేధావులు, విద్యావంతులు, రైతులు, యువత, మహిళలు ఇలా అన్ని వర్గాలను కలుస్తానని వెల్లడించారు. ప్రజాసమస్యలను ఏవిధంగా పరిష్కారం చేయాలనే విషయంపై దృష్టి పెడతానని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ యాదాద్రిని చక్కగా పునర్నిర్మించారని ఉద్ఘాటించారు. యాదాద్రి గుడి ప్రాశస్త్యాన్ని కాపాడే విధంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రయత్నం చేయాలని సూచించారు. తాను యాదాద్రి ఆలయానికి వస్తుంటే విచిత్రమైన హోర్డింగ్‌లను చూశానని... అలాకాకుండా తిరుమలలో మాదిరిగా స్వామి వారి హోర్డింగ్‌లు, చిత్రపటలే ఇక్కడ ఉండేలా చూడాలని కోరారు. మళ్లీ యాదాద్రికి తాను వస్తానని... అప్పుడు ఇక్కడున్న అన్ని సమస్యలపై వివరంగా మాట్లాడతానని చెప్పుకొచ్చారు. తెలంగాణ జాగృతి ఎన్జీవోగా ఆవిర్భవించి 19 ఏళ్లుగా కొనసాగుతోందని తెలిపారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా రాజకీయాలు, రాజకీయ సమీకరణాల గురించి తాను మాట్లాడానని పేర్కొన్నారు.

# రైతులు కొనుగోలు కేంద్రం లోనే ధాన్యం అమ్ముకోవాలి

### జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**యాదగిరిగుట్ట, మహా:** రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో ఐ కే పి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు... ఈ రోజు ఎన్ని ధాన్యం కుప్పలు వచ్చాయని,అన్ని కుప్పలను తేమ శాతన్ని చెక్ చేస్తున్నారా... తేమ శాతం వచ్చిన వాటిని వెంటనే తూకం వేసి లారీ లోడ్ చేసి సంబంధిత మిల్లులకు తరలించాలని ఆలస్యం చేయొద్దని అన్నారు.కొనుగోలు కేంద్రల లో ధాన్యం నిల్వ లు ఉండటానికి వీలు లేదని అన్నారు.ఈ కొనుగోలు కేంద్రంలో కరెంటు సదుపాయం లేదని కరెంట్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరడంతో వెంటనే సంబంధిత కరెంటు ఎస్ఈ కి ఫోన్ చేసి సాయంత్రం లోపు విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.రైతులు ఎవ్వరు కూడా బయట దళారులను నమ్మి ధాన్యంవిక్రయించవద్దని. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

### పసల విజయనంద్



**వలిగొండ, మహా :** వలిగొండ మండల పరిధిలోని చిత్తాపురం ఎంపీపీ ఎస్ దుప్పల్లి జెడ్పిహెచ్ఎస్ హైస్కూలు విద్యార్థులకు పసల విజయనంద్ సైకిళ్ల. ను గురువారం పీ ఆర్ టి యు టి ఎస్ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి సమక్షంలో పంపిణీ చేశారు

# తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన

### బీజేపీ మండల శాఖ



**వలిగొండ, మహా :** రైతు సమస్యల పైన బిజెపి నిరసన కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు గురువారం నాడు బిజెపి మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి హాజరైనారు జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల కాలంలో రైతులకు ప్రజలకు ఇచ్చినటువంటి ఎలాంటి హామీల నెరవేర్చలేదని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సీఎన్ రెడ్డి బందారపు లింగస్వామి రాచకొండ కృష్ణ బంధారపు రాములు తానేష్ గౌడ్ పోలే నాగయ్య మైసొల్ల రామ్ నర్సు కొత్త రామ్ చందర్ తదితరులు పాల్గొన్నారు

# బిజెపి ఆందోళన .. ఉద్రిక్తత

## గోరక్షక్ కార్యకర్త మీద కాల్పుల ఘటనపై సీరియస్



**హైదరాబాద్ సిటీ, మహా :** హైదరాబాద్ నగర శివారులోని పోచారం ఐటీ కారిడార్‌లో గోసంరక్షణ కార్యకర్త సోనుసింగ్ అలియాస్ ప్రశాత్ సింగ్ పై కాల్పుల ఘటనను హిందూ సంఘాలతో పాటు బీజేపీ , బీజేవైఎం లు తీవ్రంగా ఖండించాయి. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠిన శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై బీజేవైఎం గురువారం డీజీపీ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చింది. అయితే, డీజీపీ కార్యాలయానికి బయలుదేరిన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో సహా ఆ పార్టీ నేతలను పోలీసుల అసెంబ్లీ ఎదుట అడ్డుకున్నారు. అనంతరం వారు డీజీపీ కార్యాలయంలో చొచ్చుకొళ్లేందుకు ప్రయత్నించగా.. రాంచందర్ రావుతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి సమీప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మీడియాతో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. పోచారంలో గోరక్షక్ కార్యకర్తపై ఎంఐఎం దుండగులు తుపాకీతో కాల్పులు జరిపారని ఆరోపించారు. ఆ ఘటనను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు.



## జూబ్లీహిల్స్‌లో ఎవరు గెలుస్తారో..

# 14న మాట్లాడుకుందాం

శంకరాహిల్స్ లో రేవంత్ ఏం చేస్తున్నారో తెలుసు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, మహా:** జూబ్లీహిల్స్‌లో ఎవరు గెలుస్తారో.. నవంబర్ 14న మాట్లాడుకుందామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి అల్లుడు, మంత్రి కొడుకు పంచాయితీలో ఐఏఎస్ అధికారి రిజ్వీ బలి అయ్యారని చెప్పారు. రూ.500 కోట్ల టెండర్ల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి జూపల్లి మధ్య పంచాయితీ వచ్చిందని ఆరోపించారు. మంచిరేవుల భూముల వ్యవహారంలో రేవంత్ తమ్ముడు, మంత్రి కొండా కుటుంబం మధ్య గొడవ జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇంత జరుగుతుంటే.. కిషన్ రెడ్డి, బండి సంజయ్, అమిత్ షా ఎందుకు మాట్లాడటం లేదు? అని ప్రశ్నించారు. శంకరాహిల్స్ లో రేవంత్ ఏం చేస్తున్నారో, సర్వే నంబర్ 83లో ఏం చేయాబోతున్నారో అన్నీ తమకు తెలుసని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య పంపకాల విషయంలో గొడవలతో తెలంగాణ పరువు పోయిందని విమర్శించారు. తన మాట వినలేదని.. మంచి అధికారి మీద మంత్రి జూపల్లి కక్ష తీర్చుకుంటున్నాడని ఆరోపించారు.

### ఖాకీ బుక్ ఎక్కడో డీజీపీ చెప్పాలి..

తెలంగాణలో నడుస్తుంది ఇందిరమ్మ రాజ్యం కాదని.. మాఫియా రాజ్యమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కుర్చీలో దావూద్ ఇబ్రహీం తమ్ముడు కూర్చున్నాడని మండియపడ్డారు. తన ఇంటి మీదకు ముఖ్యమంత్రే పోలీసులను పంపారని మంత్రి కుమార్తె చెప్పిందని తెలిపారు. తుపాకీ ఇచ్చింది రేవంత్.. పెట్టింది రోహిణ్ రెడ్డి అని మంత్రి కొండా కుమార్తె చెప్తుందన్నారు. మంత్రి కుమార్తె ఆరోపణలపై ఎందుకు విచారణ జరపటం లేదో డీజీపీ శివధర్ రెడ్డి చెప్పాలి? అనిప్రశ్నించారు. మంత్రి ఉత్తమ్ కు సంబంధం ఉందని మంత్రి కొండా సురేఖ కూతురు చేసిన ఆరోపణలపై ఉత్తమ్ స్టేట్మెంట్ ను రికార్డ్ చేయాలన్నారు. పింక్ బుక్, రెడ్ బుక్ లేదు.. ఖాకీ బుక్ మాత్రమే ఉందని శివధర్ రెడ్డి అన్నారని.. ఆ ఖాకీ బుక్ ఎక్కడో డీజీపీ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ ది ఇల్లునా.. సెటిల్మెంట్ కు అడ్డానా? అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**తుర్కపల్లి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వీరరెడ్డిపల్లి, మాదాపూర్ గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం ప్రారంభించారు. అలాగే పలుగుల మైసమ్మ ఆలయం వద్ద సిసి రోడ్డు పనులను ప్రారంభించారు ఈ కార్యక్రమంలో RDO కృష్ణా రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ నాయక్ ,తహసీల్దారు,ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు.

# టెన్త్ పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

## ఈనెల 30 నుంచి నవంబర్ 13 లోపు చెల్లింపుకు గడువు



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో పదో తరగతి ఫైనల్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటించింది. అక్టోబరు 30వ తేదీ నుంచి నవంబర్ 13 లోపు పాఠశాల హెడ్‌మాస్టర్లకు విద్యార్థులు ఫీజు చెల్లించాలని తెలిపింది. హెచ్ఎంలు ఆన్‌లైన్ ద్వారా నవంబర్ 14 లోపు ఫీజు చెల్లింపు చేయాలని, విద్యార్థుల డేటాను నవంబర్ 18 లోపు డీఈవోలకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రూ.50 ఆలస్య రుసుముతో నవంబర్ 29 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 2 నుంచి 11వ తేదీవరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 నుంచి 29 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు.

# బల్దియాలో ఎయిర్‌లైన్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్

## ఏర్పాటు చేయనున్న సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్

సీఎం రేవంత్‌తో జరిగిన భేటీలో ఎయిర్‌లైన్స్ ప్రతినిధి బృందం వెల్లడి



**హైదరాబాద్, మహా:** అమెరికాకు చెందిన ప్రఖ్యాత విమానయాన సంస్థ సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ తన గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరిగిన సమావేశంలో సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ ప్రతినిధి బృందం ఈ నిర్ణయాన్ని వెల్లడించింది. ప్రపంచ పెట్టుబడులకు, సాంకేతిక ఆవిష్కరణలకూ కేంద్రంగా నిలుస్తోన్న హైదరాబాద్ నగరంలో గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ స్థాపన నిర్ణయాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సానుకూల విధానాలు, అభివృద్ధి లక్ష్యాలను సీఎం వివరించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా, 2034 నాటికి తెలంగాణను $1 ట్రిలియన్, 2047 నాటికి $3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అండ్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ లారెన్ వుడ్స్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ టామ్ మెరిట్, హెడ్ లీగల్ కౌన్సిల్ జాసన్ షైయింగ్, హెచ్ఈఎక్స్ అడ్వైజరీ గ్రూప్‌కు చెందిన సార్థక్ బ్రహ్మ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మేమేం చేయాలో.. నువ్వు చెప్పడం ఏంటి?



**ఢిల్లీ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్ ఏం చేయాలో ట్రంప్ చెప్పడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఇటీవల ట్రంప్ మాట్లాడుతూ.. 'భారత్ రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపుతోంది' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను శశి థరూర్ ఖండించారు. ట్రంప్ అసత్యమైన, ఆధారాలు లేని వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. భారత్ ఇప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందని, అది అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా జరుగుతోందని స్పష్టం చేశారు. భారత్ తన జాతీయ ప్రయోజనాల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటుందని, అమెరికా అధ్యక్షుడు భారత్ తరఫున నిర్ణయాలు ప్రకటించడం అనవసరమని థరూర్ అన్నారు. ఇది భారత స్వతంత్రతను, విదేశాంగ విధానాన్ని అపహాస్యం చేయడమేనని ఆయన విమర్శించారు. విదేశాంగ వ్యవహారాల్లో అనుభవం కలిగిన నేతగా, శశి థరూర్ మాట్లాడుతూ ..భారత్ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే దేశం. ఇతర దేశాల నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవచ్చు. కానీ భారత్ తరఫున నిర్ణయాలు ప్రకటించడం అనైతికం'అని అన్నారు.

# అమెరికాలో ట్రక్కు బీభత్సం.. భారతీయుడి అరెస్ట్





**కాలిఫోర్నియా:** అమెరికాలో ఓ భారతీయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాలిఫోర్నియాలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో ముగ్గురు మృతికి కారణమయ్యాడంటూ జశన్‌ప్రీత్ సింగ్ (21) అనే యవకుడిని అదుపులోకి తీసుకున్నారు. అమెరికా వార్తా కథనాల ప్రకారం.. అతడు అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించాడని.. డ్రగ్స్ మత్తులో ఉన్నట్లు వెల్లడైంది. 2022 మార్చిలో సింగ్.. అమెరికా దక్షిణ సరిహద్దును అక్రమంగా దాటినట్లు సమాచారం. కాలిఫోర్నియాలోని బోర్డర్ పెట్రోల్ (Border Patrol) ఏజెంట్లు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద చట్టబద్ధమైన ప్రతాలు లేవని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ స్పష్టం చేసింది. అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిన 'ఆల్టర్నేటివ్ టు డిటెన్షన్' విధానం కారణంగా కొన్ని రోజుల్లోనే అతడు జైలు నుంచి విడుదలయ్యాడు. కాలిఫోర్నియాలో జరిగిన ట్రక్కు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ఈ ఘటనలో జశన్‌ప్రీత్ సింగ్ కూడా గాయపడ్డాడు. ట్రక్ నడుపుతోన్న సమయంలో డ్రగ్స్ మత్తులో ఉన్న అతడు.. ట్రాఫిక్‌లో కూడా బ్రేక్స్ వేయలేదని పోలీసు అధికారులు తెలిపారు. అక్రమ వలసదారులైన ట్రక్ డ్రైవర్లు అమెరికాలో ప్రమాదాలకు కారణమవుతున్న ఘటనల్లో ఇది తాజాది. గత ఆగస్టులోనూ ఇదే తరహా ఘటన జరిగిన సంగతి తెలిసిందే. ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 2018లో అక్రమంగా అమెరికాలోకి ప్రవేశించిన హర్జిందర్ సింగ్ ఆ ఘటనకు కారకుడు.

మహా
WWW.MAHAADAILY.COM
తెలుగు
శుక్రవారం, హైదరాబాద్ | 24-10-2025



BIHAR EXPRESS

బీహార్ ఎన్నికలు కూటమి రాజకీయాలకు పెద్ద ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఒకటి కాదు.. రెండు కూటముల్లోనూ పెద్ద ఎత్తున పార్టీలు ఉన్నాయి. ఈ కారణంగా ఏ ఒక్క పార్టీ కూడా కనీసం మెజార్టీ సీట్లలో పోటీ చేయలేకపోతున్నాయి. ప్రస్తుతం బీహార్‌లో అతి ఎక్కువ సీట్లలో పోటీ చేసే పార్టీ ఆర్జేడీనే. మొత్తం 143 స్థానాల్లో పోటీ చేయడానికి అభ్యర్థులను ప్రకటించింది. బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలు ఉన్నాయి. కాంగ్రెస్ తో కూటమిలో భాగంగా ఆ పార్టీకి 61 సీట్లు కేటాయించింది. కమ్యూనిస్టులూ ఈ కూటమిలోనే ఉన్నారు. కానీ కొంత మంది కాంగ్రెస్ నేతలు.. ఆర్జేడీ పోటీ చేసే చోట ఫ్రెండ్లీ ఫైటింగ్ అని నామినేషన్లు వేస్తున్నారు. బీజేపీ , జేడీయూ కూటమిలో కూడా సీట్ల సర్దుబాటు పూర్తి అయింది. బీజేపీ 101 స్థానాల్లో మాత్రమే పోటీ చేస్తోంది. జేడీయూ 102 స్థానాల్లోపోటీ చేస్తోంది. మిగతావి రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడి పార్టీకి కొన్ని, ఇతర పార్టీలకు కొన్ని కేటాయించారు. మజ్లిస్ పార్టీ కూడా ఎన్నికల్లో పోటీ చేస్తోంది. కానీ ఏ కూటమిలోనూ చేరలేదు. గతంలో మజ్లిస్ పార్టీ హాట్ టాపిక్ అయింది. కానీ ఈ సారి ఎవరూ పట్టించుకోవడం లేదు. కానీ ముస్లింలు ఎక్కువగా ఉన్న చోట్ల అభ్యర్థులను ఓవైసీ నిలబెడుతున్నారు. ప్రశాంత్ కిషోర్ పార్టీ జనసురాజ్‌కు ఇలాంటి సమస్యలు లేవు. ఎక్కడ బలమైన అభ్యర్థి ఉంటే అక్కడ పోటీ చేస్తున్నారు. తేజస్వీ యాదవ్ పై రఘోపూర్ నుంచి పోటీ చేయాలనుకున్న ప్రశాంత్ కిషోర్ వెనక్కి తగ్గడంతో బీహార్ లో.. అత్యంత ఆసక్తికరమైన పోటీలు లేకుండా పోయాయి. సీఎం నితీష్ ఎన్నికల్లో పోటీ చేరు. సీఎం అభ్యర్థుల్లో ఒక్క తేజస్వీ యాదవ్ మాత్రమే పోటీ చేస్తున్నారు.




# బీహార్‌లో ఆర్జేడీదే హవా

## మిత్రులకు ఇక్కట్లు

మాజీ సీఎం లాలూప్రసాద్ యాదవ్‌కు చెందిన రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) తన పంతాన్ని నెగ్గించుకుంది. విపక్ష ఇండియా కూటమిలో అత్యధిక అసెంబ్లీ సీట్లు ఈ పార్టీయే దక్కించుకుంది. 143 స్థానాల్లో ఆర్‌జేడీ అభ్యర్థులు నామినేషన్లు వేశారు. రాష్ట్రంలోని మొత్తం 243 స్థానాల్లో ఇది దాదాపు 59 శాతానికి సమానం. ముస్లిం-యాదవ్ ఓటు బ్యాంకునే మరోసారి ఆర్‌జేడీ నమ్ముకుంది. తమకు ఆ రెండు వర్గాల మద్దతు లభించి తీరుతుందనే నమ్మకంతో మెజారిటీ సీట్లలో బరిలోకి దిగింది. అయితే ఆర్‌జేడీ ఆధిపత్య ధోరణి ఇండియా కూటమిలోని పలు మిత్రపక్షాలకు నచ్చడం లేదు. అందుకే పలుచోట్ల ఆర్‌జేడీ అభ్యర్థులకు వ్యతిరేకంగా కాంగ్రెస్, వామపక్షాలు, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ నేతలు నామినేషన్లు వేశారు. ఆయా చోట్ల ఆర్‌జేడీ ఓట్లను ఈ పార్టీలు చీలిస్తే, ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల విజయ అవకాశాలు పెరిగిపోతాయి. ఆర్‌జేడీ మాత్రం ఈ అంశాన్ని తేలిగ్గా తీసుకుంటోంది. కొన్నిచోట్ల మిత్రపక్షాలతో తమకు స్నేహపూర్వక పోటీ ఉంటుందని చెప్పకుంటోంది.



పాట్నాలో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల వీధి పోరాటం

## గంగానది దక్షిన ఒడ్డున పాట్నా

పాట్నా అసలు పేరు పాటలీపుత్ర లేదా పాటలీపట్టన్ మరియు దాని చరిత్ర క్రీస్తుపూర్వం 600 శతాబ్దం నుండి ప్రారంభమవుతుంది. పాట్నా అనే పేరు దాని ప్రారంభ దశలలో పాటలీగ్రామ్, కుసుంపూర్, పాటలీపుత్ర, అజిమాబాద్ మొదలైన అనేక మార్పులకు గురై, చివరికి ప్రస్తుతానికి ముగుస్తుంది. వైశాలి, రాజ్‌గిర్, నలంద, బోధ్ గయ మరియు పావాపురి వంటి బౌద్ధ, హిందూ మరియు జైన తీర్థయాత్ర కేంద్రాలు సమీపంలో ఉన్నాయి మరియు పదవ సిక్కు గురువు గురు గోవింద్ సింగ్ ఇక్కడ జన్మించినందున పాట్నా నగరం సిక్కులకు పవిత్ర నగరం . ఆధునిక పాట్నా నగరం ప్రధానంగా గంగా నది దక్షిణ ఒడ్డున ఉంది.

## సీఎం అభ్యర్థిగా తేజస్వీ యాదవే...

### లాలూ చాణక్యానికి కాంగ్రెస్ జై



బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఇండీ కూటమి తన సీఎం అభ్యర్థిని ప్రకటించింది. రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ) నేత తేజస్వి యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా, వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీ (వీఐపీ) అధినేత ముకేష్ సహనిని డిప్యూటీ సీఎం అభ్యర్థిగా గురువారం అధికారికంగా ప్రకటించింది. ఇంకా ఒక డిప్యూటీ సీఎం అభ్యర్థిని తర్వాత ప్రకటిస్తామని కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ తెలిపారు. పాట్నాలో జరిగిన సంయుక్త పాత్రికేయుల సమావేశంలో ఈ ప్రకటన చేశారు. తేజస్వి యాదవ్, ముకేష్ సహని సహా కాంగ్రెస్ బీహార్ ఇన్‌చార్జ్ కృష్ణ అల్లవరు, బీహార్ కాంగ్రెస్ చీఫ్ రాజేష్ రామ్, లెఫ్ట్ పార్టీల నేతలు హాజరయ్యారు. వారం రోజులుగా సీటు పంపకాలు, సీఎం ఫేస్ ప్రకటనపై చర్చలు జరిగిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. కూటమి నేతలతో చర్చల తర్వాత తేజస్వి యాదవ్‌ను సీఎం ఫేస్‌గా నిర్ణయించాం. ఆయనకు దీర్ఘకాలిక భవిష్యత్ ఉందని అశోక్ గెహ్లాట్ అన్నారు. ముకేష్‌సహని నిషాద్ వర్గంలో ప్రభావం కలిగిన నేత కావడంతో డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారు. మరో వెనుకబడినవర్గాల నేతను డిప్యూటీ సీఎంగా ప్రకటిస్తామని కూటమి ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదా సీఎం కావడం మాత్రమే లక్ష్యం కాదని.. బీహార్ అభివృద్ధి కోసం మేము ఏకమయ్యాం. 20 ఏళ్ల 'ఉపయోగం లేని' డబుల్ ఇంజిన్ ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలి" అని తేజస్వీ యాదవ్ పిలుపునిచ్చారు. ఎన్‌డీఏ తమ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించాలని.. నితీష్ కుమార్ నాయకత్వంలో ఎన్నికలు జరుగుతున్నాయో లేదో చెప్పాలన్నారు. నితీష్ కుమార్‌కు ఎన్‌డీఏలో అన్యాయం జరుగుతోంది. ఆయనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించలేదన్నారు.

### లాలూ చాణక్యం

తేజస్వీయాదవ్ ను సీఎం అభ్యర్థిగా ప్రకటించడం వెనుక లాలూ చాణక్యం పనిచేసింది. మహాఘట్ బంధన్ లో ఇబ్బడిముబ్బడిగా వేసిన నామినేషన్లను, పార్టీలను ఏకతాటిపైకి తేవాలంటే సీఎం అభ్యర్థి ఖరారే పరిష్కారమని లాలూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ కు నచ్చజెప్పడంతో గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్డీఏ సీఎం అభ్యర్థిగా కన్ ఫ్యూజన్ లో ఉన్న తరుణంలో ఇండికూటమి ముందుగానే స్పష్టత ఇవ్వడం ద్వారా రేసులో ముందుకొచ్చింది. బీహార్ రాష్ట్రంలో అత్యంత పాపులర్ లీడర్ తేజస్వీ యాదవే అని అనేకసర్వేలు తేల్చిచెబుతున్నాయి. ఈ క్రమంలో అనుమానాల్లేకుండా సస్పెన్స్ కు తెరదించారు.

## డిప్యూటీ సీఎంపై వ్యూహాత్మకం

### ముకేశ్ సహానీ భలే సంచలనం

బీహార్‌లో సీట్ల సర్దుబాటుపై మల్లగుల్లాలు పడిన విపక్ష ఇండియా కూటమి సీఎం, డిప్యూటీ సీఎం అభ్యర్థులనూ ప్రకటించింది. సీఎం అభ్యర్థి అందరూ ఊహించిందే. తేజస్వీయాదవ్ బీహార్ అత్యంత పాపులర్ లీడర్. అయితే డిప్యూటీ సీఎం ఎంపికపైనే మహాఘట్ బంధన్ మాస్టర్ స్ట్రోక్ కనిపిస్తోంది. వెనుకబడిన వర్గానికి చెందిన ఓ యువ నేతను డిప్యూటీ సీఎం అభ్యర్థిగా ప్రకటించి ఆ సామాజిక వర్గాన్ని తమవైపు తిప్పకునే ప్రయత్నం చేసింది. ఆయనే వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీ వ్యవస్థాపకుడు 'ముకేశ్ సహనీ'. కొన్నేళ్ల క్రితం రాష్ట్ర రాజకీయాల్లో దూకుడుగా వ్యవహరించిన ఆయన.. విపక్షం తరపున మరోసారి కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యారు. ముకేశ్ సహనీ దర్భంగాలో ఓ మత్స్యకారుల కుటుంబంలో 1981లో జన్మించారు. 19వ ఏట ముంబయికి వెళ్లి సేల్స్‌మ్యాన్‌గా పనిచేసిన ఆయన.. కొంతకాలానికి స్టేజ్ డిజైనర్‌గా బాలీవుడ్‌లో అడుగుపెట్టారు. ముకేశ్ సినీవరల్డ్ పేరుతో ఓ చిన్న కంపెనీని స్థాపించి సినీ పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకున్నారు. నిషాద్ (పడవలు నడిపే, జాలర్లు) వర్గానికి చెందిన ఈయన.. పట్నా, దర్భంగాలలో పలు సేవా కార్యక్రమాలు మొదలుపెట్టి తన సామాజిక వర్గం 'మల్లా కుమారుడు' గా తనదైన ముద్ర వేసుకున్నారు. మల్లా.. నిషాద్ వర్గంలో ఉప కులంగా ఉంది. రాష్ట్రంలో నిషాద్‌ల జనాభా 9.6శాతంగా ఉండగా, సహనీకి చెందిన మల్లాలు 2.6శాతంగా ఉన్నట్లు అంచనా. కుల రాజకీయాలే కీలకమైన బీహార్ లో నిషాద్ మహా ఘట్ బంధన్ తో కలవడం కలిసొచ్చే పరిణామమే. మహా ఘట్ బంధన్ ఎంత జాగ్రత్తగా ఓట్ల అల్లికలు చేస్తున్నదో దీనిని బట్టి స్పష్టమవుతోంది.

## ఆచితూచి.. వ్యూహాలు

ప్రధాని మోదీ చొరవతో 2015 అసెంబ్లీ ఎన్నికల సమయంలో భాజపాకు మద్దతుగా ప్రచారం చేసిన సహనీ.. తదనంతరం నిషాద్ వర్గ నాయకుడిగా ఎదిగారు. అయితే, తమ వర్గానికి ఎస్సీ హోదా కల్పిస్తామని ఇచ్చిన హామీ నేరవేర్చకపోవడంతో కాషాయ పార్టీకి ఆయన దూరమయ్యారు. అదే ఏడాది నిషాద్ వికాస్ సంఘ్ పేరుతో తన సామాజిక వర్గాన్ని ఏకీకృతం చేసే ప్రయత్నం చేశారు. 2018లో వికాస్‌శీల్ ఇన్‌సాన్ పార్టీ ని స్థాపించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మహాగఠ్‌బంధన్‌లో చేరి పోటీ చేసినప్పటికీ ఖాతా తెరవలేదు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ఎన్డీయే కూటమి తరపున పోటీ చేయగా.. వీఐపీ తరపున నలుగురు అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల్లో ఓడిపోయిన సహనీకి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన భాజపా.. పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి పదవి అప్పగించింది. అయితే, ఆ పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే మరణించడం, మరో ముగ్గురు 2022లో భాజపాలో చేరిపోవడంతో పార్టీకి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. సహనీ ఎమ్మెల్సీ పదవి కూడా ముగియడం, మరోసారి భాజపా అవకాశం ఇవ్వకపోవడంతో ఆయన మంత్రి పదవికి దూరమయ్యారు. మహాగట్ బంధన్‌లో ప్రధాన పార్టీలుగా ఉన్న ఆర్జేడీ, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ (ఎంఎల్) లిబరేషన్‌లు సీట్ల పంపకాల కోసం కుస్తీ పడడంతో పాటు నిషాద్ వర్గానికి మరింత చేరువయ్యేందుకు ప్రయత్నించిన విపక్ష కూటమి.. వీఐపీని తమవైపు తిప్పుకునేందుకు వ్యూహాలు రచించింది. ఇందులో భాగంగా ఉప ముఖ్యమంత్రి హామీ ఇవ్వడం ద్వారా గతంలో ఎన్డీయే వైపు మొగ్గు చూపిన ఈ వర్గం ఓటర్లు ఈసారి తమకు మద్దతుగా నిలుస్తారని విపక్ష ఇండియా కూటమి ఆశిస్తోంది. విపక్ష కూటమి మాస్టర్ స్ట్రోక్ ఎత్తుగడగా దీనిని భావిస్తున్నారు.

# విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

## కాంగ్రెస్ యూత్ నాయకుడు బత్తుల వినోద్



**వరంగల్ మహా;** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు జన్మ దినాన్ని పురస్కరించుకొని గురువారం వరంగల్ తూర్పు నియోజకవర్గం 20వ డివిజన్ లోని నరేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ యూత్ నాయకుడు బత్తుల వినోద్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు సిసిసి డెలిగేట్ మెంబర్ నల్గొండ రమేష్ తోకలిసి సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నారగొని స్వప్న మురళి గౌడ్, 21,19, 41, డివిజన్ల అధ్యక్షులు కొమ్ముల సందీప్, దాసరి రాజేష్, మంద సన్నీ, కొండ వీరాభిమాని పోలేపాక యేసు కాంగ్రెస్ నాయకులు తోట హరీష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గిరి పుష్ప, వరంగల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమలక్ష్మి, 19వ డివిజన్ అధ్యక్షురాలు రాజమణి పాల్గొని విద్యార్థులకు ఉపయోగపడే, ఎగ్జామ్ ప్యాడ్లు, కంబాక్సు, పెన్నులు, తదితర స్టేషనరీ వస్తువులను విద్యార్థులకు పంపిణీ చేశారు.

# ఓరుగల్లు నగరం ఎంతో చారిత్రాత్మకం

## ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ అరవింద్ కుమార్.. పంజాబ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ విశ్వజిత్ ఖన్నా





**వరంగల్ హన్మకొండ మహా;** వరంగల్ లోని కాకతీయుల కళా సంపదను వీక్షించడానికి విచ్చేసిన ఉత్తరప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ అరవింద్ కుమార్ దంపతులు, పంజాబ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ విశ్వజిత్ ఖన్నా దంపతులు గురువారం హన్మకొండ, నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ కు విచ్చేసిన సందర్భంగా ఎన్పీడీసియల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి , వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, హన్మకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, వరంగల్ కలెక్టర్ సత్య శారదా, జీడబ్ల్యుయంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయి, పుష్పగుచ్ఛాలు తో ఆహ్వానం పలికారు. మొదటగా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్లు హన్మకొండలోని వేయి స్తంభాల గుడిని సందర్శించారు. పూజారులు మహా రుద్రాభిషేకం రుద్రేశ్వర స్వామివారికి జరిపించి , వేద పండితులచే ఆశీర్వచనం జరిపించారు. కాకతీయుల కళ చతురతను చూసి అబ్బురపడ్డారు. చైర్మన్లు ఇరువురు మాట్లాడుతూ కాకతీయుల సామ్రాజ కళా పిపాసాకు , శిల్పుల పనితనానికి మచ్చుతునకగా భావితరాలకు నిలుస్తుందని పేర్కొన్నారు. ఇంతటి ప్రసిద్ధి గల కాకతీయుల వంశానికి చెందిన వేయి స్తంభాల గుడిని దర్శించుకోవడం సంతోషదాయకంగా ఉందన్నారు. అనంతరం భద్రకాళి మాత ఆలయాన్ని దర్శించుకున్నారు. భద్రకాళి ప్రధాన అర్చకులు శేషు పూర్ణకుంభ తో స్వాగతం పలికారు. భద్రకాళి ప్రధాన అర్చకులు శేషు ఆశీర్వచనం జరిపించారు. తదనంతరం వరంగల్ లోని ప్రసిద్ధి చెందిన ఓరుగల్లు కోటలో ఉన్న కాకతీయ కీర్తితోరణాలు, ఏకశిల గుట్ట, గుండుచెరువు, ఖుష్ మహల్ ను సందర్శించారు. స్వయంభూశివాలయంలో పంచామృతం తో అభిషేకాలు నిర్వహించారు. అక్కడ ఉన్న గైడ్ సూర్య కిరణ్ వివరిస్తూ చరిత్ర ప్రకారం ఈ కోటకు మూడు ప్రాకారాలు ఉన్నాయని, ఆ ప్రాకారాల అవశేషాలు ఇప్పటికి కూడా చూడవచ్చని , మొదటి ప్రాకారం మట్టితో చేసినది దీనిని ధరణి కోట అని పిలుస్తారని వివరించారు . ఇది 20 అడుగుల ఎత్తు ఉంటుందని , రెండవ ప్రాకారములో ఉన్నది రాతి కోట గ్రానైటు రాళ్ళతో నిర్మితమైనదని గైడ్ చెప్పారు . రాతి కోటకు పెద్ద పెద్ద ఏకశిలా రాతి ద్వారాలు ఉన్నాయని , ఈ ద్వారాల ఎత్తు 30 అడుగుల ఉండి ఏకశిల నిర్మితమైనవి అని తెలిపారు. కోట ద్వారం మీద కీర్తి తోరణాలు ఉన్నాయని (పూర్ణ కుంభం వంటివి). ఈ కీర్తి తోరణాలు ఇప్పటి తెలంగాణ ప్రభుత్వ అధికారిక చిహ్నంగా ఉన్నాయని చెప్పారు . తదనంతరం చైర్మన్లు ఇరువురు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర గల వరంగల్ ను సందర్శించడం సంతోషంగా ఉందని , కాకతీయులు నిర్మించిన స్మారక కట్టడాల్లో కోటలు, సరస్సులు, దేవాలయాలు, రాతి ద్వారాలు పర్యాటక ఆకర్షణగా ఉన్నాయని అన్నారు . ఎన్పీడీసియల్ సీఎండీ శ్రీ కర్నాటి వరుణ్ రెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, జీడబ్ల్యుయంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయి శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి . మోహన్ రావు , టి . మధుసూదన్ ,సి . ప్రభాకర్ , హన్మకొండ ఎస్ఈ పి .మధుసూదన్ రావు , వరంగల్ ఎస్ఈ కె . గౌతమ్ రెడ్డి , డి .ఈ లు సాంబరెడ్డి , మల్లికార్జున్ , భాస్కర్ , ఏ.డి.ఈ పి.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## శిశు గృహాలో ఒప్పంద ఉద్యోగాలకు

# దరఖాస్తుల ఆహ్వానం

## జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి

**హన్మకొండ మహా;** తెలంగాణ ప్రభుత్వం మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ హనుమకొండ పరిధిలోని శిశు గృహలో ఒప్పంద ప్రాతిపదికన నర్స్, చౌకిదార్ ఉద్యోగాల నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, అనుభవం, వయసు, తదితర పూర్తి వివరాలకు హనుమకొండ సుబేదారిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్), జీ1, జీ2 బ్లాక్ లో ఉన్న జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని, పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత ధృవ పత్రాలు జత చేసి ఈనెల 24 వ తేది నుంచి 31వ తేదీ లోపు మా కార్యాలయంలో సమర్పించాలని, అర్హులైన మహిళా అభ్యర్థులను మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని, నర్సు ఉద్యోగానికి 11,916/ లు, చౌకిదార్ కు 7944/ లు వేతనం చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఉద్యోగ ప్రకటనను ఎలాంటి కారణాలు తెలుపకుండా రద్దు చేసే పూర్తి అధికారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కు కలదని జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి ప్రకటనలో పేర్కొన్నారు.

# నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

## మట్టెవాడ పోలీస్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ రావు




**వరంగల్ మహా;** వరంగల్ సబ్ డివిజన్ లోని మట్టెవాడ పోలీస్ స్టేషన్ లో ఇన్స్పెక్టర్ ఎన్ కరుణాకర్ ఆధ్వర్యంలో మాంటిసోరి స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు నేరాల పై అవగాహన, కేసుల విచారణ, సన్నిహిత విధులు పోలీస్ స్టేషన్ లో ఉండే రికార్డ్స్ ను చూపిస్తూ ముఖ్యంగా చిన్నపిల్లల పై లైంగిక వేధింపుల కేసులు తదితర విషయాల గురించి, పోలీసుల విధుల తో పాటు ఆపద సమయంలో డయల్ 100, 181, పోలీస్ స్టేషన్లో ఉండే లాకప్ గురించి స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించడం జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కరుణాకర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో నేరాల గురించి, చుట్టుపక్కల జరిగే వివిధ సంఘటనలు పోలీస్ వ్యవస్థ పై బాల్యం నుండే విద్యార్థిని విద్యార్థులకు అవగాహన ఉండడం వల్ల భవిష్యత్తులో వారి ప్రవర్తన పై ప్రభావం చూపడమే కాకుండా నేర నియంత్రణకు కూడా చాలా వరకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు సుమారు 100 మంది, మాంటిస్సోరి టీచర్స్, స్టేషన్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్ తూర్పులో ఘనంగా మాజీ ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు

## 900 మంది కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేసిన గోపాల్ నవీన్ రాజ్

**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు జన్మదిన వేడుకలు ఆయా డివిజన్లలో ఘనంగా నిర్వహించారు. వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్ వద్ద కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపాల్ నవీన్ రాజ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం సుమారు 900 మంది పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లను పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే 12, 13, 18, 21, 22, 23, 24, 27, 28, 32, 33, 34, 35, 36, 37, 38, 39, 40, డివిజన్ల స్థానిక కార్పొరేటర్లు తో పాటు పలు డివిజన్లలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కొండా దంపతుల వీరాభిమానుల ఆధ్వర్యంలో కొండా మురళి జన్మదిన వేడుకల్లో భాగంగా భారీ కేక్ లు కట్ చేసి స్థానిక ప్రజలకు పండ్ల పంపిణీ తో పాటు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో కార్పొరేటర్లు, కంటెస్టెంట్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నేతలు, డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కొండా మురళి జన్మదిన వేడుకల్లో కోడం శివకృష్ణ హామీ



**వరంగల్ మహా;** పేద మధ్యతరగతి ప్రజల ఆశాజ్యోతి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు జన్మదినం సందర్భంగా కొండా దంపతుల వీరాభిమాని కోడం శివకృష్ణ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ తూర్పు 33వ డివిజన్ లో కొండా మురళి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటగా శివ కృష్ణ స్థానిక నాయకులతో కలిసి భారీ కేక్ కట్ చేసిన అనంతరం డివిజన్లోని పేద ప్రజలకు దుప్పట్లను, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నాయకుడి అడుగుజాడల్లోనే తాను నడుస్తూ భవిష్యత్తులో డివిజన్ ప్రజలకు ఉపయోగపడేలా స్వచ్ఛమైన మంచినీరు అందించే లక్ష్యంగా ఒక మినరల్ వాటర్ ప్లాంట్ ను తన సొంత డబ్బులతో మూడు నెలల్లోనే ఏర్పాటు చేస్తానని కోడం శివకృష్ణ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిట్ట నిశాంత్, కొమ్మరాజుల సందీప్, చందు, బొమ్మ గాని శ్రీనివాస్, బైరి ప్రతాప్, శేఖర్, రాఘవరెడ్డి, సారంగపాణి, శ్యామ్, బన్నీ, నాగరాణి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## రియల్ ఎస్టేట్ పేరుతో కోటి రూపాయల

# ఘరానా మోసం

**హన్మకొండ మహా;** మంచిర్యాల జిల్లాకు చెందిన రామిడి సంపత్ రెడ్డి 2021 సంవత్సరంలో తాను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని, తాను తక్కువ ధరకు భూములు ఇపిస్తానని బాధితులకు మాయమాటలు చెప్పి వారి వద్ద నుండి సుమారు కోటి రూపాయలు వసూలు చేసి ఎటువంటి భూములు చూపెట్టకుండా, వాయిదాలు వేస్తూ మోసం చేయడంతో బాధితులు జనవరి నెలలో హనుమకొండ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా గురువారం ఆ ఘరానా మోసగాన్ని అదుపులోకి తీసుకోవడం జరిగిందని హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. ఎవరు కూడా భూముల క్రయవిక్రయ విషయంలో ఆ భూమి యజమాని తో తప్ప వేరే ఎవరిని గుడ్డిగా ఎవర్నినమ్మి మోసపోవద్దని ఇన్స్పెక్టర్ తెలిపారు.

# మాట నిలబెట్టుకునే నాయకుడు నన్నపునేని నరేందర్

## జ్యోతిరావు పూలే విగ్రహా శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే



**వరంగల్ మహా;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 40వ డివిజన్లో రెండు రోజుల క్రితం దుండగులు ధ్వంసం చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం తో పాటు సావిత్రిబాయి పూలే కాంస్య విగ్రహాలను పునఃప్రతిష్టించేందుకు తన సొంత డబ్బులను ఖర్చు చేస్తానని ఆ రోజు ఇచ్చిన హామీ మేరకు గురువారం గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకపోయినా నేనెప్పుడూ తూర్పు ప్రజలకు చేరువలోనే ఉంటానని నేను ఇచ్చిన మాట ప్రకారం ఆ మహోన్నతుల విగ్రహాలను పునః ప్రతిష్టించడం లో నేను భాగస్వామిని అయినందుకు ఎంతో ఆనందంగా ఉందని సమాజ సంస్కరణకు మార్గదర్శకులైన మహాత్మ జ్యోతిరావు పూలే అలాగే సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో సమానత్వం, విద్యా ప్రగతికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, ఆయా డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఇన్‌చార్జీలు, బీసీ నాయకులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సాస్కి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

## బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**హన్మకొండ మహా;** గ్రేటర్ వరంగల్ నగరం లో సాస్కి (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ) పథకం అమలుకు సమగ్ర సమాచారం తో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం కుడా కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో సాస్కి పథకం అమలులో భాగంగా కుడా, బల్దియా లోని పట్టణ ప్రణాళిక ఇంజనీరింగ్ శానిటేషన్ తో పాటు పలు విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం లో కమిషనర్ పాల్గొని సమీక్షించారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ సాస్కి పథకానికి సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా అవగాహన చేసుకొని అన్ని అంశాలను క్రోడీకరించి వారం లోగా పూర్తి సమాచారం అందజేయాలని సూచించారు. అలాగే రూపకల్పన లో భాగంగా నగరం లో గల పురాతత్వ విధానాలను ప్రోత్సహించి అభివృద్ధి చేయాలని, పాదచారులు నడిచే మార్గాలను అభివృద్ధి చేయడం మౌలిక వసతులను కల్పించడం ప్రజల రక్షణ చర్యలు చేపట్టడం సీసీటీవీ కెమెరాల ఏర్పాటు పార్కుల అభివృద్ధి, ఓపెన్ స్పేస్ లను అభివృద్ధి చేయడం స్పాంజ్ సిటీ ఏర్పాటు ఇందుకోసం అనువైన స్థలాన్ని గుర్తించడం సిటీ గ్రీన్ కార్యక్రమం లో నగరం లో గ్రీనరీ ఏర్పాటు కు చర్యలు చేపట్టడం పురాతన బావుల పునరుద్ధరణ తదితర అంశాల పట్ల దృష్టి సారించి నమోదు చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఈ సత్యనారాయణ, కుడా సి పి ఓ అజిత్ రెడ్డి, సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, సి హెచ్ ఓ రమేష్, హెచ్ ఓ లక్ష్మారెడ్డి, ఈ ఈ లు రవికుమార్, సంతోష్ బాబు, డి ఈ లు రవి కిరణ్, శివానంద్, స్మార్ట్ సిటీ పి ఎం సి ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లను, గుండాయిజాన్ని నియంత్రించాలి

## ఘన్పూర్ పోలీస్ స్టేషన్, ఏసీపీ కార్యాలయాలను సందర్శించిన సిపి



**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం వెస్ట్ జోన్ పరిధిలోని ఘనపూర్ పోలీస్ స్టేషన్ పాటు ఏసిపి కార్యాలయాలను సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సిపి సంబంధిత స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి. స్టేషన్ పరిధిలో ఎన్నిసెక్టార్లు వున్నాయి, సెక్టార్‌వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐని అడిగి తెలిసుకోవడంతో పాటు స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలని, ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతనే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాల కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలని. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని, నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకొసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట వెస్ట్ జోన్ డిసిపి రాజ మహేంద్ర నాయక్, ఏసీపీ భీం శర్మ, ఘన్పూర్ ఇన్స్ స్పెక్టర్ వేణు తో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రక్తదానం చేసి మరో ముగ్గురి ప్రాణాలు కాపాడవచ్చు

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ మహా;** రక్త దానం చేయడం ద్వారా ప్రాణాపాయస్థితిలో ఉన్న మరో ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడగలమని వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని కాజీపేట డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మడికొండలోని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వరంగల్ పోలీస్ సీపీ ప్రారంభించారు. ఈ శిబిరంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు స్థానిక యువత, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వీరికి సీపీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, పండ్లను అందజేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ అమరవీరులను స్మరిస్తూ రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ప్రజలకు అభినందనలు, శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులను స్మరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సిపి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిపి అంకిత్ కుమార్, కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్, రాష్ట్ర రెడ్ క్రాస్ పాలక సభ్యుడు ఇవి శ్రీనివాస్ తో పాటు డాక్టర్లు ఇతర పోలీస్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

# తేజస్వి స్కూల్లో విద్యార్థుల వరుస మరణాలు

## ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు.. బ్రెయిన్ డెడ్ తో ఓ విద్యార్థి మృతి



**హన్మకొండ మహా;** హనుమకొండలోని తేజస్వీ స్కూల్ లోని విద్యార్థుల వరుస మరణాల తో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి కుటుంబ సభ్యులు స్కూల్ ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండలోని నయీమ్ నగర్ లో ఉన్న తేజస్వి స్కూల్లో నెల రోజుల కిందట క్రీడా మైదానంలో ఒక విద్యార్థి ఆడుకుంటూనే కింద పడిన ఘటనలో విద్యార్థి హాస్పిటల్ చేరుకోక ముందే హార్ట్ ఎటాక్ తో చనిపోయాడు. ఈ ఘటన మరువక ముందే గురువారం నాలుగవ తరగతి చదువుతున్న బానోతు సుజిత్ ప్రేమ్ అనే విద్యార్థి క్లాస్ రూమ్ లోనే కింద పడడంతో స్కూల్ యాజమాన్యం చికిత్స నిమిత్తం హాస్పిటల్ కు తీసుకెళ్లారు. కాగా అక్కడ వైద్యులు చికిత్సలో భాగంగా విద్యార్థిని పరీక్షించి బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందాడని నిర్ధారణ చేశారు. దీంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు.

# పోలీస్ సేవలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు ఎస్సై అవగాహన



**మందమర్రి, మహా :** పోలీస్ సేవలు, సైబర్ నేరాలపై విద్యార్థినీ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మందమర్రి ఎస్సై రాజశేఖర్ సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాల (ఫిల్టర్ బెడ్) విద్యార్థులకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) వారోత్సవాలను పురస్కరించుకొని మందమర్రి పోలీస్ స్టేషన్ ఆవరణలో 'ఓపెన్‌హౌస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసుల త్యాగాలు, సేవలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. చట్టాన్ని గౌరవించడం, ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రస్తుత సమాజంలో కీలకంగా మారిన పలు అంశాలపై పోలీసులు సమగ్ర అవగాహన కల్పించారు. సైబర్ నేరాల తీరు, మోసగాళ్ల వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే ఫిర్యాదు చేసేందుకు ఉన్న 1930 నంబరు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, భయంకరమైన పరిణామాలపై హెచ్చరించి, వాటికి దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం సేవలు, షీ టీమ్ పనితీరు గురించి కులంకుశంగా వివరించారు. పోలీసు విధులు, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, యాంటీ నార్కోటిక్ డ్రగ్స్ వంటి విభాగాల బాధ్యతలను క్లుప్తంగా చెప్పుకొచ్చారు. ఓపెన్‌హౌస్‌లో భాగంగా, విద్యార్థులకు పోలీసు వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా పరిచయం చేశారు. స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది విధులు, బాధితులు ఫిర్యాదు ఇచ్చే విధానం, దానిపై విచారణ జరిగే పద్ధతిని వివరించారు. పోలీసులు వినియోగించే సాంకేతిక పరికరాలైన సీసీ కెమెరాల ప్రాధాన్యం, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్‌మెంట్, ముఖ్యంగా డయల్ 100 విధానం గురించి క్లుప్తంగా వివరించి, కాల్ చేసిన వెంటనే పోలీసులు ఎలా స్పందిస్తారో విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం, ఆయుధాల వినియోగాన్ని ప్రదర్శించి, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై మాజీద్ ఖాన్, మిలింద్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# కమ్యూనిటీ హాల్ నిర్వహణ బాధ్యత బల్దియాదే

## ప్రైవేటు వ్యక్తులు నిర్వహిస్తే చర్యలు తప్పవు.. బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరం లోని ప్రభుత్వ కమ్యూనిటీ హాల్ నిర్వహణ బల్దియా దేనని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ నిధులతో నిర్మాణం చేసిన అన్ని కమ్యూనిటీ హాల్ లను వెంటనే స్వాధీనం చేసుకొని ఇక పై బల్దియా అధికారులే నిర్వహణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. గత కొన్ని సంవత్సరాలుగా కొన్నిచోట్ల ప్రభుత్వ స్థలాల్లో, ప్రభుత్వ నిధులతో నిర్మాణం చేసిన కమ్యూనిటీ హాల్ లను ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కమిషనర్ ఈ చర్యకు ఆదేశించారు. నగర పరిధిలో సుమారుగా 6080 చిన్న పెద్ద కమ్యూనిటీ హాల్స్ ఉన్నాయని వీటిలో సగానికి పైగా బల్దియా అధికారుల చేతిలో ఉన్నాయని మిగిలిన కొన్ని కమ్యూనిటీ హాల్ లను ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్నారని తమ దృష్టికి రావడం జరిగిందని అంతే కాకుండా వారు ఇవి తమవే అంటూ దబాయిస్తున్నారని కొన్ని సందర్భాల్లో ఈ కమ్యూనిటీ హాల్లో చిన్న చిన్న వేడుకలు నిర్వహించు కోవడానికి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తనకు ఫిర్యాదులు అందాయని ఇందువల్ల కమ్యూనిటీ హాల్స్ పై దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. ఈ పర్యవేక్షణ కోసం టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన ఇంచార్జ్ సిటీ ప్లానర్ తో పాటు ఇతర విభాగాల అధికారులకు సర్కిల్ 2 డిప్యూటీ కమిషనర్ ,రెవెన్యూ ఇన్స్పెక్టర్లకు, ప్రతి సర్కిల్ పరిధి లోని అన్ని కమ్యూనిటీ హాల్ ల పూర్తి వివరాలను తీసుకురావాలని ఆదేశించడం జరిగిందని తెలిపారు. అనంతరం అధికారులు జాబితాను రూపొందించి తనకు అందజేశారని నగరం లో ఎక్కడ ప్రైవేట్ వ్యక్తులు ఆధీనంలో ఉన్న కమ్యూనిటీ హాలు లను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఇకపై నిర్వహణ అంతా డిప్యూటీ కమిషనర్లు చూసుకోవాలని ఆదేశించడం జరిగిందని, ఇందులో భాగంగా గురువారం హనుమకొండ టీఎన్జీవోస్ కాలనీలోని రోజ్ గార్డెన్ ను టౌన్ ప్లానింగ్ అధికారులు డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో ఆ గార్డెన్ ను స్వాధీనం చేసుకొని బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇక పై ఈ కమ్యూనిటీ హాల్ ల నిర్వహణ రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో ఉంటుందని ఎవరైనా హాల్ బుకింగ్ చేసుకోవాలనుకుంటే ఆన్ లైన్ లో చేసుకోవచ్చని ఒక ఫంక్షన్ కు రూ. 20 వేలతో పాటు అదనంగా విద్యుత్ ఛార్జీలు చెల్లిస్తే సరిపోతుందని, దీనితో పాటు మిగిలిన కమ్యూనిటీ హాల్ లను మరో రెండు రోజుల్లో స్వాధీనం చేసుకొని కొన్ని కమ్యూనిటీ హాల్ ల యందు వార్డు కార్యాలయాలను నిర్వహించాలని ప్రతి వార్డు ఆఫీసర్ ఈ వార్డు కార్యాలయంలో విధులు నిర్వహించాలని కమిషనర్ సూచించారు.

# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం -కంది శ్రీనివాస రెడ్డి

**రాంపూర్ లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరు.. డప్పుల చప్పట్లతో ఘన స్వాగతం పలికిన శ్రేణులు గ్రామస్తులు**

**ఆదిలాబాద్ మహా :** రాంపూర్ గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను శాయ శక్తులా కృషి చేస్తానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం భోరజ్ మండలం రాంపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు. స్థానిక కాంగ్రెస్ శ్రేణులు గ్రామస్తులు ఆయనకు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. స్థానిక ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాంపూర్ గ్రామం తనను ఓట్లతో ఆశీర్వదించిందన్నారు. ఎలాంటి ఆపద వచ్చినా ఆదుకునే బాధ్యత తనదన్నారు.గతంలో కాంగ్రెస్ పార్టీ కి ఎప్పుడు రాని విధంగా ఓట్లు 48 వేలకు పైగా ఓట్లు వచ్చాయన్నారు. తన సంపాదనలో 50 శాతం ప్రజల కోసమే ఖర్చు పెడతాన్నారు. ఆదిలాబాద్ కి ఎప్పుడు ఏ పని మీద వచ్చిన తన క్యాంప్ ఆఫీస్ కి వచ్చి భోజనం చేయాలని కోరారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. గ్రామంలో మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, గ్రామస్తులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్ రావు, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి , జైనథ్ ఆలయ చైర్మన్ రుకేష్ రెడ్డి , మునిగెల విఠల్, సందా నర్సింగ్ , శాంతన్ రావు , ఎంఏ షకీల్,గీ,రాంరెడ్డి, ఉదయ్ కిరణ్, సంతోష్,బత్తుల శ్రీనివాస్, ఉట్ల దిలీప్, ఉంట్ల ప్రవీణ్, నిరటి సంతోష్, నిరటి నితిన్, మాధవి ప్రవీణ్, ఆత్రం నవీన్, ఆత్రం భూమన్న, నర్రా విఠల్ భోరాజ్ జైనథ్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మీడియాపై దాడులు హేయమైన చర్య

**ఐక్య సంఘాల ఆధ్వర్యంలో మంచిర్యాల ఐబి చౌరస్తాలో నిరసన**



**మంచిర్యాల, మహా :** ప్రజలకు, ప్రభుత్వానికి నిస్వార్థ సేవలందిస్తున్న మీడియాపై ఒక పార్టీకి చెందిన దుండగులు దాడులు హేయమైన చర్యని మంచిర్యాల ఐక్యజర్నలిస్టు సంఘాల నాయకులు విమర్శించారు. గురువారం మంచిర్యాల ఐబి చౌరస్తా లో వరంగల్ జిల్లా కేంద్రంలో నమస్తే తెలంగాణ దిన పత్రిక కార్యలయంపై జరిగిన దాడిని ఖండిస్తూ ఐక్య జర్నలిస్టు సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ, పత్రికలపై మీడియాపై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించారు. అన్యాయాలను అక్రమాలను దోపిడీలను నిక్కచ్చితంగ సమాజానికి అందించే నాలుగవ స్తంభంగా ఉన్న మీడియాపై కక్షసాధింపు చర్యలకు పూనుకోవడం మానుకోవాలని హితవు పలికారు. పత్రికలు, టీవీ ఛానళ్ళు ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకలని అన్నారు. నమస్తే తెలంగాణ కార్యాలయం పై దాడులకు పాల్పడిన వారిని గుర్తించి పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మీడియాపై దాడులు పాల్పడితే రాష్ట్ర వ్యాప్తంగా పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టి జర్నలిస్టుల సత్తా చాటుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐక్య జర్నలిస్ట్ సంఘాల నాయకులు రాజలింగు, చిట్ల రమేష్, పార్వతి సురేష్, ఉమేష్, బొడ్డు మల్లేష్, వంశీ, రాజు పటేల్, రమేష్‌రెడ్డి, రాజు, నరేష్, వెంకటస్వామి, అంబిలపు శ్రీనివాస్, దుద్దేల తిరుపతి, పడాల సంతోష్, పార్వతి రాజేష్, సిద్దార్థ్ తదితరులు పాల్గొన్నారు.

# రాంపూర్ గ్రామంలో కంది శ్రీనివాస రెడ్డి పర్యటన





## అభివృద్ధి పనులకు భూమి పూజ

**ఆదిలాబాద్ మహా :** రాంపూర్ గ్రామంలో దాదాపు 20 లక్షల ఎస్డీఎఫ్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం భోరజ్ మండలం రాంపూర్ గ్రామంలో ఆయన పర్యటించారు.స్థానిక కాంగ్రెస్ శ్రేణులు గ్రామస్తులు ఆయనకు డప్పు చప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి, పాఠశాల ప్రహారీ గోడ నిర్మాణ సనులకు ఆయన శ్రేణులు, గ్రామస్తులతో కలిసి భూమిపూజ చేసారు. అనంతరం గ్రామంలోని బ్రిడ్జిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్‌రావు, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి , జైనథ్ ఆలయ చైర్మన్ రుకేష్ రెడ్డి , మునిగెల విఠల్, సందా నర్సింగ్ , శాంతన్ రావు , ఎంఏ షకీల్,గీ,రాంరెడ్డి, ఉదయ్ కిరణ్, సంతోష్,బత్తుల శ్రీనివాస్, ఉట్ల దిలీప్, ఉంట్ల ప్రవీణ్, నిరటి సంతోష్, నిరటి నితిన్, మాధవి ప్రవీణ్, ఆత్రం నవీన్, ఆత్రం భూమన్న, నర్రా విఠల్ భోరాజ్ జైనథ్ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధలో ఓదార్పు...

**పలు కుటుంబాలకు కంది శ్రీనివాస రెడ్డి పరామర్శ**





**ఆదిలాబాద్ మహా :** బాధలో దుఖంలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెబుతూ అండగా నిలబడతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి.ఆప్తులను కుటుంబ సభ్యులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న కుటుంబాలకు , అనారోగ్యం తో బాధపడుతున్న వారి చెంతకు వెళ్లి పరామర్శించి నేనున్నానంటూ కొండంత భరోసా కల్పిస్తారు. గురువారం జైనథ్ మండలం దీపాయి గూడ లో బండారి హన్మండ్లు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ లో రిటైర్డ్ మున్సిపల్ ఉద్యోగి మంథని నర్సింగ్ గుండె పోటుతో మరణించడంతో అతని కుటుంబాన్ని , ఖానాపూర్ లోనే ఇటీవలే గుండె పోటు తో మృతి చెందిన ఐటీడీఏ ఉద్యోగి మోకాన పల్లి జయ్ పాల్ , అనారోగ్యంతో మృతి చెందిన 26వ వార్డు బర్కోట కాలనీ కి చెందిన ముస్త్రీజహా, అనారోగ్యం తోనే మృతి చెందిన పిట్టల్ వాడ కు చెందిన మాజీ యంపీటీసి చాకంటి లక్ష్మీబాయి ల మృతి పట్ల తీవ్ర సానుభూతి వ్యక్తపరుస్తూ వారి కుటుంబ సభ్యులను కంది శ్రీనివాస రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట గిమ్మ సంతోష్ , సందా నర్సింగ్ , బెల్లూరి రంరెడ్డి , గౌతమ్ రెడ్డి , మహమూద్ , ఉదయ్ తదితరులున్నారు.

# ఈనెల 25న మినీ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ**

**మంచిర్యాల, మహా :** ఈ నెల 25 న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించు మినీ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 25 అక్టోబర్ నాడు మంచిర్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని టాస్క్ ట్రైనింగ్ సెంటర్ లో ఉదయం 10.30 గంటలకు మినీ జాబ్ మేళా నిర్వహించడం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జె. వి. జి. మేనేజ్మెంట్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థలో హైదరాబాద్ ప్రాంతంలో పని చేసేందుకు 100 టెక్నీషియన్స్ (ఫ్రెషర్స్) పోస్టుల భర్తీకి ఐటిఐ (ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, టర్నర్, మిషనిస్ట్, వెల్డర్) అర్హత కలిగి 1822 వయసు కలిగిన పురుషులు/మహిళ అభ్యర్థులు, 100 ట్రైనీ టెక్నీషియన్స్ (ఫ్రెషర్స్) భర్తీకి ఎస్. ఎస్. సి./ఇంటర్/ఏదేని డిగ్రీ అర్హత కలిగి 18 23 వయసు అర్హత కలిగిన పురుషులు/మహిళ అభ్యర్థులకు అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 9010584000, 8333059029, 9963452486 నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఏటీఎమ్‌ల అద్దాలు ధ్వంసం

**ఆదిలాబాద్ మహా :** పట్టపగలు ఓ అపరిచిత వ్యక్తి ఏటీఎంల అద్దాలు పగులగొట్టిన ఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటు చేసుకుంది. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ లో పక్కపక్కనే ఉన్న ఎస్బీఐ, హెచ్ డీఎఫ్సీ ఏటీఎంల డోర్ల అద్దాలను ఓ దుండగుడు రాళ్లతో పగలగొట్టినట్లు స్థానికులు తెలిపారు. ఏటీఎంల అద్దాలు పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దుండగుడిని గుర్తించేందుకు సీసీటీవీలను పరిశీలిస్తున్నారు.




# బెల్లంపల్లిలో అండర్ 19 క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీలో గురువారం నాడు మంచిర్యాల & ఆసిఫాబాద్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్ జి ఎఫ్ అండర్ 19క్రికెట్ పోటీలను ఎస్ జి ఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకార్యదర్శి బాబురావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిలుగా బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కారుకూరి రాంచందర్, టిపిసిసి రాష్ట్ర ప్రచార కానిటి కన్వీనర్ నాతరి స్వామి,టిజిఎస్డబ్ల్యూ ఆర్ జె సిబాయ్స్ కాజీపేట ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్,కెరియర్ గ్రూప్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపురాజేశం లు పాల్గొని క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు రాణించాలని క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని అదేవిధంగా రాష్ట్ర జాతీయ స్థాయిలలో పాల్గొనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని దిశా నిర్దేశం చేశారు .ఈ పోటీలకు 100 మంది పైగా విద్యార్థులు పాల్గొన్నట్లు ఎస్ జి ఎఫ్ అండర్ 19 ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కార్యదర్శి డి బాబు రావు తెలిపారు. ఈ సందర్భంగా నాతరి స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు మానసిక ధైర్యాన్ని కలిపిస్తాయన్నారు. అదేవిధంగా సెలక్షన్లో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి,జాతీయస్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమాన్ని మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ప్రెసిడెంట్ అల్లం వెంకటేష్‌తో పాటు పలువురు క్రీడాకారులు,వ్యాయామ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పోలీసుల సైకిల్ ర్యాలీ

**ఆదిలాబాద్ మహా:** పోలీస్ అమరవీరులు అందించిన సేవలు వెలకట్టలేనివని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం నిర్వహించిన సైకిల్ ర్యాలీలో పోలీసులతో కలిసి ఆయన పాల్గొన్నారు. స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద నుండి ప్రారంభమైన ర్యాలీ వినాయక్ చౌక్, దేవి చంద్ చౌక్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, నేతాజీ చౌక్, గర్ల్స్ హైస్కూల్, బస్టాండ్ మీదుగా కొనసాగి తిరిగి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద పూర్తయింది.దారి పొడవునా జోహార్ జోహార్ అమరవీరులకు జోహార్ అంటూ నినాదాలు చేసారు. అమరుల సేవలను స్మరించుకోవడానికి వారి కుటుంబాలకు ధన్యవదాలు తెలపడానికి పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వారం రోజుల పాటు ప్రతీ రోజుకో కార్యక్రమం ఉంటుందన్నారు. అదనపు ఎస్పీ బి సురేందర్ రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్ జీవన్ రెడ్డి, కమతం ఇంద్ర వర్ధన్, పట్టణ సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు దాదాపు వంద మంది పోలీసులు సైకిళ్ళ తో ర్యాలీ లో పాల్గొన్నారు.



# వాసాలమర్రిని కేసీఆర్ వల్లకాడు చేసిండు..

**బీర్ల అయిలయ్యప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే**

**తుర్కపల్లి, మహా:** గత ప్రభుత్వంలో సిఎం కేసీఆర్ వాసాలమర్రి గ్రామాన్ని దత్తత తీసుకొని వల్లకాడు చేశాడని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని అభివృద్ధిలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతామని అన్నారుయాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో గురువారం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మార్నింగ్ వాక్ చేసిఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పురోగతితో పాటు గ్రామలో ఇంకా ఏ ఏ సమస్యలు వున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు ప్రత్యేకంగా ఆకుల ఆగమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించి ఆగమ్మతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భువనగిరి RDO కృష్ణా రెడ్డి, ఆలేరు మార్కెట్ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, హౌజింగ్ డడీ ఈ శ్రీరాములు, తహసీల్దారు, ఎంపిడిఓతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ నాయక్, పలుగుల శ్రీనివాస్, బాబు తదితరులు ఉన్నారు.



# బాధితులకు పరిహారం చెక్కు అందజేత

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో గల జాఫర్ నగర్ లో విద్యుత్ ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులకు నష్ట పరిహారం చెక్కును అందజేసినట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో విద్యుత్ ప్రమాదంలో ఇంటిని కోల్పోయిన బాధితులు చిట్టోజు శరణ్య కు 36 వేల రూపాయల పరిహారం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాల పట్టణంలోని జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన చిట్టోజు శరణ్య విద్యుత్ ప్రమాదంలో తన ఇంటిని కోల్పోయినందున, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద బాధితులకు 36 వేల రూపాయల చెక్కును అందజేయడం జరిగిందని తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో తక్షణ ఆర్థిక సహాయం క్రింద 7 వేల రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# జోనల్ కుస్తీ పోటీలకు క్రీడాకారిణిల ఎంపిక

**లక్షటి పేట/మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా లక్షటి పేట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో అండర్14, 17 బాలికల జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ కె రమా కళ్యాణి తెలిపారు. ఈ పోటీలలో జిల్లాలో ఉన్న వివిధ కళాశాలల బాలికలు అధిక సంఖ్యలో పోల్గోన్నారని ప్రతిభ చాటారని చెప్పారు. అండర్ 14, 17 కుస్తీ పోటీ విభాగాలలో ప్రతిభ కనబరిచన వారిని జోనల్ స్థాయికి ఎంపిక చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ పోటీలలో ఎన్నికైన క్రీడాకారిణిలు జోనల్ పోటీలలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు పోటీపడాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి ఈ టి డి ఓ రమాదేవి, ఆర్గనైజింగ్ సెక్రెటరి రాజేష్, సాంబమూర్తి, తిరుపతి, మమత, స్వరూప, దీపిక, మహేష్ లు ఉన్నారు.




# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి

**జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**యాదగిరిగుట్ట, మహా:** విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మండలం మల్లాపురం గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో మధ్యాన్న భోజనాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు మెనూ ప్రకారం ఈ రోజు విద్యార్థులకు వండిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. రోజు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెడుతున్నారా అని విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులందరూ విధులకు హాజరు అవుతున్నారా అని ఆరా తీశారు. పదో తరగతి చదివే విద్యార్థులు ఎంతమంది ఉన్నారని, విద్యార్థులకి సాయంత్రం ప్రత్యేక తరగతులు నడుస్తున్నాయ అని స్కూల్ ప్రిన్సిపాల్ ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబందించిన అధికారులు పాల్గొన్నారు.



# తాండూరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఇందిరమ్మ లబ్దిదారుల ధర్నా

**బెల్లంపల్లి, మహా:** తాండూరు మండలం రేచిని గ్రామ పంచాయతీ లోని ఇందిరమ్మ ఇళ్లలబ్దిదారులు మైనింగ్ ఏడీ వైఖరికి నిరసనగా తాండూర్ ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా గురువారం చేపట్టారు .ఈ సందర్భంగా లబ్దిదారులు మాట్లాడుతూ మంచిర్యాల మైనింగ్ ఏడీ తాండూర్ మండలంలో ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, మామూళ్లు ఇవ్వని ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు ఇసుక సరఫరా కాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మైనింగ్ ఏడీ వాళ్ళ ఎస్ఆర్ఓ లకు చెప్పి మహిళ లబ్దిదారుల ఫోటోలు తీపించి, తన ఫోన్ కి పంపమంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక రాకుండా అడ్డుకుని ప్రజల్లో ప్రభుత్వం మీద వ్యతిరేకత వచ్చేలా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. అనంతరం మంచిర్యాలకలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో లబ్దిదారులు విద్య, సౌఖ్య,రూప,మమత,స్వప్న,మాధవి,మమత,సుమలత,శాంతబాయి,శారద, స్వప్న, సంధ్య పాల్గొన్నారు.



# బెల్లంపల్లి లోని సింగరేణి భూములను యాజమాన్యం రక్షించాలి

**బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ నాయకులు**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి సింగరేణి ఆధీనంలోని భూములను అన్యాక్రాంతం కాకుండా రక్షించేందుకు యాజమాన్యం కసరత్తు చేయాలని బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు డిమాండ్ చేశారు.సౌత్రాస్ కట్ గని భూమి కబ్జాకు గురైందని బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గతంలో మందమర్రి జనరల్ మేనేజర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని దీంతో సింగరేణి అధికారులు సానుకూలంగా స్పందించి గురువారం రోజు క్రాస్ కట్ గని భూమి మొత్తాన్ని సింగరేణి ఆధీనంలోకి తీసుకొని ఇనుప పోల్స్ తోపాటు ఇనుప కంచె వేసి భూమిని కాపాడడం జరిగిందని పట్టణ పరిరక్షణ కమిటీ నాయకులు వెల్లడించారు. సంబంధిత అంశంలో మందమరి ఏరియా జిఎం రాధాకృష్ణ కు బెల్లంపల్లి పట్టణ పరిరక్షణ కమిటీ తరపున ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం రోజు మందమరి జిఎంను క్షేత్రస్థాయిలో కలిసి బెల్లంపల్లి పట్టణంలో కబ్జాకు గురవుతున్న భూముల విషయంపై చర్చించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కొంకుల రాజేష్, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గెల్లి జయరాం, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి.అఫ్జల్, కాంగ్రెస్ పట్టణ ప్రధానకార్యదర్శిళఆడెపు మహేష, ఎం సిపిఐ యూ జిల్లా సహాయ కార్యదర్శి పసుపులేటి వెంకటేష్,టిడిపి ఉమ్మడి జిల్లా కార్యదర్శిఅమానుల్లా ఖాన్,టిడిపి ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు అంబాల మచ్చయ్యతదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ఏరియాలోని నిరుద్యోగ యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారంరోజు ఈ నెల 26వ తేదీన సింగరేణి ఆధ్వర్యంలో బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సంబంధించిన ప్రచార పోస్టర్ ను బెల్లంపల్లి ఏఎంసి గ్రౌండ్ లో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ ఆవిష్కరించారు.అనంతరం మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ప్రజా ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణం గా బెల్లంపల్లిలో సుమారు 80 కి పైగా ప్రైవేటు కంపెనీల వారితో మెగా జాబ్ మేళాను వచ్చే ఆదివారం నిర్వహిస్తున్నామని,దీనిని నిరుద్యోగయువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జాబ్ మేళాలో పాల్గొనదలిచిన నిరుద్యోగ యువత పోస్టర్ లో ఉన్న క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ మెగా జాబ్ మేళా ద్వారా నిరుద్యోగులు తమకు గల విద్యార్హతలకు సంబంధించిన ఉద్యోగాలను ఎంచుకునే అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం విజయ ప్రసాద్, బెల్లంపల్లి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సి ఎం ఓ ఏ ఐ అధ్యక్షులు రమేష్, సివిల్ ఎస్.ఈ రాము, జి.ఎం.వి.టి.సి మేనేజర్ శంకర్, ఏఐటియుసి సీనియర్ నాయకులు చిప్ప నరసయ్య, ఏఐటియుసి మందమరి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, గోగర్ల శోభన్ బాబు, నోబెల్ ఎంపవర్మెంట్ స్టేట్ మేనేజర్, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.





# కొడుకుతో వాచ్‌మెన్‌కు క్షమాపణ చెప్పించిన ముకేశ్ అంబానీ

దేశంలోనే అత్యంత సంపన్నుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎన్ని లక్షల కోట్ల సంపద ఉన్నా హుందాగా, అణకువగా ఉంటారు. తమ పిల్లలకూ అవే విలువలు నేర్పించారు. పిల్లలు తప్పులు చేసినప్పుడు అవసరమైతే కఠినంగానూ వ్యవహరించారు. ఇలాగే ఓ సందర్భంలో తమ కొడుకు ఆకాశ్ అంబానీతో వాచ్‌మెన్‌కి క్షమాపణ చెప్పించారని మీకు తెలుసా? ముకేష్ అంబానీ, నీతా అంబానీ దంపతులు లక్షల కోట్ల సంపద ఉన్నా డౌన్ టు ఎర్త్ స్వభావం కలిగి ఉంటారు. ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తారు. వారు తమ పిల్లలు ఆకాశ్ అంబానీ (Akash Ambani), అనంత్ అంబానీ, ఇషా అంబానీలో సైతం ఈ విలువలను నింపారు. పిల్లల పెంపకం విషయంలో సాధారణ తల్లిదండ్రుల మాదిరిగానే కఠినంగా వ్యవహరించారు.

## వాచ్‌మెన్‌కు క్షమాపణ చెప్పిన ఆకాశ్ అంబానీ

ముఖేష్ అంబానీ ఒకసారి తన పెద్ద కొడుకు ఆకాశ్ అంబానీతో వాచ్‌మెన్‌కి క్షమాపణ చెప్పించారు. సిమి గరేవాల్ షోలో పేరెంటింగ్ విధానాల గురించి చర్చ సందర్భంగా నీతా అంబానీ ఆ సంఘటన గురించి పంచుకున్నారు. ఓసారి ఆకాశ్ బిల్డింగ్ వాచ్‌మెన్‌తో ఫోన్‌లో చాలా దురుసుగా మాట్లాడుతున్నాడు. దీన్ని గమనించిన ముకేశ్ అంబానీ వెంటనే ఆశాశ్‌ను మందలించినట్లుగా నీతా అంబానీ వెల్లడించారు. అంతటితో ఆగకుండా కొడుకు ఆకాశ్‌ను కిందకు తీసుకువెళ్లి ఆ వాచ్‌మెన్‌కు క్షమాపణ చెప్పించారు. ఈ విషయంలో ముకేశ్ పేరెంటింగ్ స్టైల్ చాలా కఠినంగా ఉందని నీతా వివరించారు. వారి సామాజిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవంగా చూడాలని ముకేశ్ తన పిల్లలకు స్పష్టంగా బోధించారని తెలిపారు. అంబానీ కుటుంబంలో భాగమైనంత మాత్రాన తన పిల్లలను ఎప్పుడు హద్దు దాటనీయలేదని నీతా చెప్పకొచ్చారు.

# యూపీఐ ఆల్‌టైమ్ రికార్డ్: రూ. 94వేల కోట్లు!

యూపీఐ (UPI) లావాదేవీలు ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉన్నాయి. 2025 అక్టోబర్‌లో సగటు రోజువారీ లావాదేవీలు.. సెప్టెంబర్‌తో పోలిస్తే 13 శాతం పెరిగి రూ.94,000 కోట్లకు చేరుకున్నట్లు 'నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (NPCI) వెల్లడించింది. 2025 అక్టోబర్ 18న రూ.1.02 లక్షల కోట్ల విలువైన.. 75.4 కోట్ల యూపీఐ చెల్లింపులు జరిగాయి. ఇది ఒక రోజులో జరిగిన అత్యధిక లావాదేవీలు కావడం విశేషం. జీఎస్టీ సవరణ, ధంతేరాస్, దీపావళి వంటివి చెల్లింపులు పెరగడానికి దోహదపడ్డాయి. అక్టోబర్ నెల ముగియడానికి ఇంకా వారం రోజులు గడువు ఉండగానే లావాదేవీలు గరిష్టాలను తాకినట్లు స్పష్టమవుతోంది. 2025 అక్టోబర్ నెలలో ఇప్పటివరకు సగటున రోజుకు 69.5 కోట్ల లావాదేవీలు జరిగినట్లు సమాచారం. ఇది 2025 సెప్టెంబర్ నెలతో (65.4 కోట్లు) పోలిస్తే 6 శాతం ఎక్కువ. అక్టోబర్ 20 నాటికి.. యూపీఐ రోజువారీ లావాదేవీల విలువ ఆరుసార్లు రూ.లక్ష కోట్లు దాటింది. సాధారణంగా.. నెల ప్రారంభంలో జీతాలు & ఈఎంఐ చెల్లింపుల కారణంగా లావాదేవీలు ఎక్కువగానే ఉంటాయి. ఆ తరువాత ఖర్చు క్రమంగా తగ్గుతుంది. అయితే ఈ నెలలో పండుగలు రావడంతో.. లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. దీంతో నెలవారీ లావాదేవీ విలువ మొదటిసారిగా రూ.28 లక్షల కోట్లు దాటుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా దేశంలోని మొత్తం డిజిటల్ చెల్లింపులలో.. 85 శాతం వాటా యూపీఐదే కావడం విశేషం.




# ఆలస్యం చేయొద్దు.. వేగంగా కొనండి

### రాబర్ట్ కియోసాకి

నిజమైన డబ్బును మాత్రమే పొదుపు చేయండి. ఫేక్ కరెన్సీని పొదుపు చేయడం వల్ల ధనవంతులు కాలేరని సూచించే రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత 'రాబర్ట్ కియోసాకి' ఇప్పుడు తాజాగా సోషల్ మీడియా వేదికగా మరో రెండు ట్వీట్స్ చేశారు. ''గోల్డ్, సిల్వర్, బిట్‌కాయిన్ క్రాష్ అవుతున్నాయి. అయితే బట్‌కాయిన్ విలువ ఈ నెలలో పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం బిట్‌కాయిన్‌లకు డిమాండ్ పెరిగిపోతోంది. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 20 మిలియన్ల మంది బిట్‌కాయిన్‌లను కొనుగోలు చేశారు. వీటి సంఖ్య 21 మిలియన్స్ మాత్రమే. కాబట్టి కొనుగోలును వేగవంతం అవుతుంది. దయచేసి ఆలస్యం చేయకండి'' అని కియోసాకి పేర్కొన్నారు. ''ప్రస్తుతం అమెరికా అప్పు పెరుగుతూనే ఉంది. జాతీయ అప్పు 37 ట్రిలియన్ డాలర్ల వద్ద ఉంది. వేల సంవత్సరాలుగా నిజమైన డబ్బు అంటే.. బంగారం, వెండి అని నాకు తెలుసు. నేడు ఈ జాబితాలోకి బిట్‌కాయిన్ & ఎథెరియం కూడా చేరాయి. కాబట్టి డబ్బు సేవ్ చేయడంలో తెలివిగా వ్యవహరించండి. అయితే జాగ్రత్త వహించండి'' అని కియోసాకి స్పష్టం చేశారు.



### బంగారం, వెండి, బట్‌కాయిన్

2025 అక్టోబర్ 17వరకు భారీగా పెరిగిన బంగారం ధరలు.. ఆ తరువాత తగ్గుముఖం పట్టాయి. దీంతో రూ. 13,000 దాటిన గోల్డ్ రేటు రూ. 12,500 వద్దకు చేరింది. ఇదే సమయంలో రూ. 2.03 లక్షలకు చేరిన వెండి రేటు.. రూ. 17,4000 వద్దకు వచ్చింది. అయితే ఈ ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇక బట్‌కాయిన్ విషయానికి వస్తే.. గత వారంలో కొంత తగ్గుముఖం పట్టిన బట్‌కాయిన్ విలువ.. నేడు 1.87 శాతం పెరిగి రూ. 96,18,503.80 వద్దకు చేరింది. దీన్నిబట్టి చూస్తే.. బట్‌కాయిన్ విలువ మళ్లీ ఊపందుకున్నట్లు తెలుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే.. రాబర్ట్ కియోసాకి చెప్పిన మాటలు నిజమయ్యే అవకాశం కూడా ఉంది.

# నక్క తోక తొక్కిన గోల్డ్ బాండ్లు.. రూ.100కు రూ.325

**ముంబై:** సావరిన్ గోల్డ్ బాండ్స్ 2017-18 సిరీస్ IVలో పెట్టుబడి పెట్టినవారు ఇప్పుడు పండుగ చేసుకుంటున్నారు. ఎందుకంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రాముకు రూ.12,704 తుది రిడంప్షన్ ధరను ప్రకటించింది. అంటే 8 సంవత్సరాల కాలంలో 325 శాతం రాబడిని వస్తోందన్నమాట. వాస్తవానికి అక్టోబర్ 2017లో గ్రాముకు రూ.2,987 వద్ద జారీ చేసిన బాండ్లు ఇప్పుడు రూ. 9,717 లాభాన్ని ఇచ్చాయి. దీనికి ఆర్నెళ్లకోసారి చెల్లించే 2.5% వార్షిక వడ్డీ అదనం. 2025 అక్టోబర్ 17, 20, 22 తేదీల్లో ఇండియా బులియన్ అండ్ జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రచురించిన బంగారం సగటు ముగింపు ధర (999 స్వచ్ఛత) ఆధారంగా రిడంప్షన్ ధరను నిర్ణయించారు. దిగుమతులను తగ్గించడంతోపాటు.. బంగారంపై పెట్టుబడులను డిజిటల్‌వైపు మళ్లించే లక్ష్యాలతో తీసుకొచ్చిందే సావరిన్ గోల్డ్ బాండ్ పథకం. పసిడిపై పెట్టుబడులను డిజిటల్ రూపంలోకి మళ్లించడంలో కేంద్రం ఒక విధంగా సక్సెస్ అయింది. కానీ, బంగారం దిగుమతులు మాత్రం తగ్గలేదు. ఎస్‌జీబీలకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రభుత్వ హామీతో కూడిన సాధనం కావడంతో పెట్టుబడులకు ఎక్కువ మంది ఆసక్తి చూపించారు. దీంతో ఎస్‌జీబీల రూపంలో ప్రభుత్వంపై చెల్లింపుల భారం పెరిగిపోయింది. దీంతో సావరిన్ గోల్డ్ బాండ్ల జారీని ప్రభుత్వం నిలిపేసింది. సావరిన్ గోల్డ్ బాండ్‌లు అందుబాటులో లేనప్పటికీ డిజిటల్ గోల్డ్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునేవారికీ ఇప్పటికీ ఇతర మార్గాలు ఉన్నాయి. అవే గోల్డ్ ఈటీఎఫ్‌లు. వీటిని మ్యూచువల్ ఫండ్ సంస్థలు జారీ చేస్తాయి. వీటిలో పెట్టిన పెట్టుబడులు స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో షేర్లలా ట్రేడ్ అవుతాయి. గోల్డ్ ఈటీఎఫ్ ధర బంగారం మార్కెట్ ధరకు నేరుగా అనుసంధానమై ఉంటుంది. బంగారం ధర పెరిగితే, ఈటీఎఫ్ యూనిట్ విలువ కూడా పెరుగుతుంది.








# ఇజ్రాయెల్‌ను మేమే రక్షించుకుంటాం.. అమెరికాపై ఆధారపడం: నెతన్యాహు

**జెరూసలేం:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ దేశం (ఇజ్రాయెల్) అమెరికా రక్షిత ప్రాంతం కాదని, ఎలాంటి ముప్పు ఎదురైనా ఇజ్రాయెల్ స్వయంగా ఎదుర్కొంటుందని ఆయన స్పష్టంగా తెలిపారు. ఇజ్రాయెల్ భద్రతను కాపాడేది ఇజ్రాయెల్ మాత్రమే. మేము ఇతర దేశాలపై ఆధారపడలేం అంటూ వ్యాఖ్యలు చేశారు. గాజా కాల్పుల విరమణ ఒప్పందం పురోగతిపై చర్చించేందుకు బుధవారం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో నెతన్యాహు సమావేశమయ్యారు. వాన్స్-నెతన్యాహు సమావేశంలో గాజా పరిస్థితి, హమాస్ కార్యకలాపాలు, యుద్ధానంతర పునరావాసం, అంతర్జాతీయ సాయంపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలో నెతన్యాహు మాట్లాడారు. గాజాలో అంతర్జాతీయ దళాలను మోహరిస్తే భవిష్యత్తులో ఆ ప్రాంతం నుంచి ఉద్భవించే భద్రతా ముప్పులకు ఇజ్రాయెల్ సమాధానం చెప్పే అవకాశాలు తగ్గిపోతాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ భద్రతను కాపాడేది ఇజ్రాయెల్ మాత్రమే. మేము ఇతర దేశాలపై ఆధారపడలేం అని స్పష్టం చేశారు. గాజా యుద్ధం తరువాత భవిష్యత్తు పరిపాలనపై అంతర్జాతీయ వర్గాలు వివిధ ప్రతిపాదనలు చేస్తుండగా నెతన్యాహు వ్యాఖ్యలు కీలకంగా మారాయి. అంతకుముందు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, నెతన్యాహు కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ వాన్స్ మాట్లాడుతూ.. ఇజ్రాయెల్, అమెరికా ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. హమాస్‌ను నిరాయుధీకరణ చేయడం, ఆ సంస్థ ఇకపై ఇజ్రాయెల్‌కు ముప్పుగా మారకుండా చూసుకోవడం, గాజాను పునర్నిర్మించడం వంటి అంశాలు సులభం కావు. కానీ మేము ఆశావహ దృక్పథంతో ముందుకు వెళ్తున్నాం' అని చెప్పుకొచ్చారు.

## సమగ్ర పరిష్కారమే అవసరం

గాజా సంక్షోభం తగ్గించాలంటే రాజకీయ స్థాయిలో సమగ్ర పరిష్కారం అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు. హమాస్ నిరాయుధీకరణతో పాటు పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోతే మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నెతన్యాహు, వాన్స్ సమావేశం అనంతరం ఇరుదేశాల ప్రతినిధులు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో..ఇజ్రాయెల్ భద్రతా హక్కును అమెరికా గౌరవిస్తుంది. గాజాలో మానవతా సాయం అందించడంలో ఇరుదేశాలు కలిసి పని చేస్తాయని పేర్కొన్నారు. గాజా యుద్ధం తగ్గుముఖం పట్టినా, రాజకీయ స్థాయిలో ఒప్పందాలు సాఫీగా సాగకపోవడం అంతర్జాతీయ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ పరిస్థితుల్లో నెతన్యాహు చేసిన వ్యాఖ్యలు గాజా భవిష్యత్తుపై కొత్త చర్చలకు దారితీశాయి.

# రష్యా అణు విన్యాసాలు

## స్వయంగా పర్యవేక్షించిన పుతిన్

**మాస్కో:** ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించే విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ మధ్య హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో జరగాల్సిన భేటీ అనూహ్యంగా రద్దయ్యింది. ఈ సమావేశం ఎప్పుడు జరుగుతుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. అసలు జరుగు తుందో లేదో కూడా తెలియడం లేదు. ట్రంప్‌ను కలుసుకోవడానికి పుతిన్ ఇష్టపడడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలో పుతిన్ బుధవారం రష్యా వ్యూహాత్మక అణు దళాల విన్యాసాలను పర్యవేక్షించడం గమనార్హం. ఈ విషయాన్ని పుతిన్ టీవీలో ప్రకటించారు. అలాగే ఆయన రష్యా సైనికాధికారులను ఉద్దేశించి ఆన్‌లైన్‌లో మాట్లాడారు. న్యూక్లియర్ డ్రిల్‌స్‌లో భూఉపరితలం, సముద్రం, గగనతలానికి సంబంధించిన దళాలు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ విన్యాసాల్లో భాగంగా ఖండాంతర బాలిస్టిక్ మిస్సైళ్లు, గగనతల క్రూయిజ్ మిస్సైళ్లను ప్రాక్టికల్‌గా ప్రయోగించినట్లు రష్యా అధికార వర్గాలు ఒక ప్రకటనలో వెల్లడించాయి. పుతిన్ స్వయంగా పర్య వేక్షించారని పేర్కొన్నాయి. వ్యూహాత్మక అణు జలాంతర్గామి బ్రియాన్‌స్క్, టీయూ 095 ఎంఎస్ వ్యూహాత్మక బాంబర్లు సైతం ఇందులో పాల్గొన్నట్లు తెలిపాయి. పుతిన్, ట్రంప్ భేటీపై ప్రస్తుతానికి తమ కు ఎలాంటి సమాచారం లేదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ స్పష్టంచేశారు. పుతిన్‌తో సమావేశంపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని డొనాల్డ్ ట్రంప్ మంగళవారం ప్రకటించారు. మరోవైపు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మధ్య జరగాల్సిన సమావేశం కూడా నిరవధికంగా వాయిదా పడడం గమనార్హం.



# హైదరాబాదీని రక్షించే ప్రయత్నాల్లో కేంద్రం

ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల కోసం రష్యా వెళ్లిన భారతీయులు.. బలవంతంగా సైన్యంలో చేరి ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. అలా హైదరాబాద్ (తెలంగాణ)కు చెందిన ఓ వ్యక్తి చిక్కుకుపోగా.. అతన్ని రక్షించాలంటూ భాదిత కుటుంబం కేంద్రాన్ని ఆశ్రయించింది. దీంతో కేంద్రం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అహ్మద్(37) ఈ ఏడాది ఏప్రిల్‌లో రష్యాకు వెళ్లాడు. ఓ నిర్మాణ సంస్థలో భాగంగా పని ఉందంటూ ఏజెంట్ నమ్మబలికి అతన్ని అక్కడికి పంపించాడు. అయితే నెలపాటు అహ్మద్ ఏపని లేకుండా ఖాళీగా ఉన్నాడు. అడిగితే.. రేపో మాపో పని చెబుతామంటూ నిర్వాహకులు చెప్పసాగారు. ఈలోపు.. అహ్మద్‌లా ఇతర దేశాల నుంచి వచ్చిన మొత్తం 30 మందిని జమ చేసి ఉక్రెయిన్ సరిహద్దు ప్రాంతానికి తరలించారు. అక్కడ బలవంతంగా వాళ్లకు ఆయుధ శిక్షణ ఇప్పించి.. యుద్ధంలోకి దింపారు. వాహనంలో తరలిస్తున్న క్రమంలో ఇదే అదనుగా అహ్మద్ దూకి పారిపోయే ప్రయత్నం చేశాడు. ఆ ప్రయత్నంలో అతని కాలికి గాయం కావడంతో రష్యా సైన్యానికి చిక్కాడు. యుద్ధం చేయాల్సిందేనని, లేకుంటే తామే చంపేసి డ్రోన్ దాడుల్లో చనిపోయినట్లు చిత్రీకరిస్తామని బెదిరించారు. దీంతో గత్యంతరం లేక రష్యా తరపున ఉక్రెయిన్ యుద్ధంలో అహ్మద్ పాల్గొంటున్నాడు. అయితే తన దగ్గర ఉన్న ఫోన్‌తో జరిగిందంతా ఓ సెల్ఫీ వీడియోగా తీసి భార్య అఫ్షా బేగంకు పంపాడు. అందులో.. తాను ఎదుర్కొన్న పరిస్థితులన్నీ వివరించాడు. నాతో పాటు ఉన్న 26 మంది మేం యుద్ధంలో పాల్గొనమని చెప్పాం. అందులో నలుగురు భారతీయులు ఉన్నారు. వాళ్లు నా మెడపై తుపాకీ పెట్టి.. యుద్ధం చేస్తావా? చస్తావా? అని బెదిరించారు. నా కాలికి గాయమైనా కనికరించకుండా హింసించారు. ఇప్పటికే 17 మంది మరణించారు. అందులో ఓ భారతీయుడు కూడా ఉన్నాడు. ఉద్యోగాల పేరిట బలవంతంగా ఈ నరకంలోకి మమ్మల్ని లాగారు. ఎట్టిపరిస్థితుల్లో మమ్మల్ని ఇక్కడకు పంపిన ఏజెంట్‌ను (ముంబైకి చెందిన కన్సల్టెన్సీ) వదలొద్దు అని అహ్మద్ ఆ వీడియోలో చెప్పాడు. ఈ వీడియో ఆధారంగా అహ్మద్ భార్య అఫ్షా బేగం కేంద్ర విదేశాంగ శాఖకు ఓ లేఖ రాసింది. తన భర్త తమ కుటుంబానికి ఆధారమని, ఆయన్ని రక్షించాలని విదేశాంగ మంత్రి జై శంకర్‌ను ఉద్దేశిస్తూ వేడుకుంది. మరోవైపు.. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని సైతం కలిసి సాయం చేయాలని కోరింది. దీంతో.. ఆయన అహ్మద్‌ను వెనక్కి రప్పించాలంటూ కేంద్రానికి, రష్యాలోని భారత రాయబార కార్యాలయానికి విజ్ఞప్తి చేశారు. అహ్మద్ భార్య, హైదరాబాద్ ఎంపీ ఒవైసీ విజ్ఞప్తులతో కేంద్రం కదిలింది. అహ్మద్ గురించి వివరాలు సేకరించి విడిపించే ప్రయత్నం చేస్తామని మాస్కోలోని భారత రాయబార సిబ్బంది తడు మాము (Tadu Mamu) హామీ ఇచ్చారు. భారత విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం.. రష్యా ఆర్మీలో 27 మంది భారతీయులు చిక్కుకుపోయారని, వారిని రక్షించే ప్రయత్నాలు చేస్తున్నామని, వాళ్ల కుటుంబాలతో నిరంతరంగా సంప్రదింపులు జరుపుతున్నామని చెబుతోంది.





# ప్రభాస్ బ్రాండ్..

## రూ.7 వేల కోట్ల మార్కెట్

"ప్రభాస్ పేరు కాదు, బ్రాండ్." ఎందుకంటే ఆయన సినిమాకు ఫ్లాప్ టాక్ వచ్చినా సరే వందల కోట్ల కలెక్షన్స్ వసూలు చేయడం సాధారణం. ఇది ప్రభాస్ పవర్ ఏంటో సూచిస్తుంది. అత్యధిక బడ్జెట్ సినిమాలు, బాక్సాఫీస్ రికార్డులు, అంతర్జాతీయ స్థాయిలో ఫ్యాన్ ఫాలోయింగ్ ఇవన్నీ ప్రభాస్ సినీ ప్రయాణంలో సాధారణ విషయాలే. కానీ, ఆయన వ్యక్తిత్వం మాత్రం అసాధారణం. మీడియాకు దూరంగా ఉంటూనే తన పనితోనే మాట్లాడే బాహుబలి.. సినిమా ఏదైనా సరే ప్రతి పాత్రలో తన శ్రమను, నిబద్ధతను చూపిస్తారు. తెలుగు సినిమా చరిత్రలో ప్రభాస్ ఒక విప్లవాత్మక అధ్యాయం. ఆయన మాటలు తక్కువ, కానీ ప్రభావం ఎక్కువ. బాహుబలి రూపంలో భారతీయ సినిమాకు ఒక కొత్త దిశను చూపించారు. ప్రభాస్ అంటే కేవలం నటుడు కాదు – ఒక భావన, ఒక స్ఫూర్తి, ఒక క్రేజ్. ఆయన సినిమాలు విడుదలయ్యే రోజు, అభిమానులకు పండుగ. ఆయన పుట్టినరోజు అంటే సేవా కార్యక్రమాలు, సోషల్ మీడియా సందడి కనిపించడం సహజం. నేడు ప్రభాస్ పుట్టినరోజు జరుపుకుంటున్నారు.

### ఛత్రపతితో మొదలు

ప్రముఖ నటులు దివంగత కృష్ణంరాజు వారసుడిగా 2002లో ఈశ్వర్ సినిమాతో ప్రభాస్ తెరంగేట్రం చేశారు. ఈ సినిమా నటుడు విజయ్ కుమార్ కుమార్తె శ్రీదేవికి కూడా తెలుగులో తొలి సినిమా. ఈ సినిమా విజయం సాధించినా ఆ తర్వాత 2003లో విడుదలైన 'రాఘవేంద్ర' సినిమా పరాజయం పాలైంది. 2004లో త్రిష సరసన నటించిన 'వర్షం' సినిమా ప్రభాస్ మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ప్రభాస్ అడవి రాముడు, చక్రం సినిమాల్లో నటించాడు. ఈ సినిమాల ద్వారా ప్రభాస్‌కు నటుడిగా పేరు లభించినా పరాజయం పాలయ్యాయి. 2005లో ఎస్. ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్- శ్రియా కాంబోలో 'ఛత్రపతి' వచ్చింది. ఆ సినిమా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఈ సినిమాతో ప్రభాస్‌కు ఎక్కడలేని ఫ్యాన్ బేస్‌ను క్రియేట్ చేసింది. దీంతో తెలుగు పరిశ్రమలో టాప్ హీరోల లిస్ట్‌లో ప్రభాస్ చేరిపోయాడు.

## ప్రభాస్ లైఫ్‌లో ఇవన్నీ ఎంతో ప్రత్యేకం

- ప్రముఖ మ్యూజియం మేడమ్ టుసాడ్స్‌లో మైనపు విగ్రహం కలిగిన మొదటి దక్షిణాది స్టార్‌గా ప్రభాస్ గుర్తింపు పొందారు.
- కేవలం 'బాహుబలి' ప్రాజెక్టు కోసం ఐదేళ్లు కేటాయించడం.. ప్రభాస్ 2014లోనే తొలిసారి హిందీ సినిమాలో మెరిశారు. అజయ్ దేవగణ్, సోనాక్షి సిన్హా కలిసి నటించిన 'యాక్షన్ జాక్సన్'లో అతిథిగా కనిపించారు. కల్కి సినిమా ఆరు రోజుల్లో రూ. 700 కోట్ల వసూలుతో 2024లో అత్యధిక కలెక్షన్లు సాధించిన భారతీయ చిత్రంగా నిలిచింది. రష్యన్ ఆడియన్స్ హార్ట్ అవార్డు పొందిన రెండవ భారతీయ నటుడిగా ప్రభాస్ నిలిచారు, ఇది ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది
- COVID19 సమయంలో CM రిలీఫ్ ఫండ్‌కు రూ. 4 కోట్లు విరాళంగా ప్రభాస్ ఇచ్చారు. ఇది తెలుగు సినీ పరిశ్రమలో అత్యధిక విరాళంగా గుర్తించబడింది. స్టార్‌డమ్ సొంతం చేసుకుని ఎన్నో ఏళ్లయినా ప్రభాస్ ప్రకటనలకు కాస్త దూరంగా ఉన్నారు. 2015లో తొలిసారి ఓ కారు ప్రచారంలో భాగంగా వాణిజ్య ప్రకటనలో నటించారు. రూ. 100 కోట్ల రెమ్యునరేషన్ తీసుకున్న తొలి నటుడిగా రికార్డుకెక్కాడు. ప్రభాస్ ఆదిపురుష్ కోసం రూ. 100 నుంచి 120 కోట్లు తీసుకున్నట్లు తెలుస్తోంది. బాహుబలి 2 సినిమా భారతీయ సినిమా చరిత్రలో మొదటి వెయ్యి కోట్లు దాటిన చిత్రం. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా సుమారు 2000 కోట్లు వసూలు చేసింది.
- మిర్చి సినిమాకు ఉత్తమనటుడిగా 2013లో నంది అవార్డు దక్కించుకున్న ప్రభాస్
- తన 1650 ఎకరాల ఖాజిపల్లి రిజర్వ్ ఫారెస్ట్ భూమిని దత్తత తీసుకొని తన తండ్రి పేరు మీద ఎకో పార్క్ కు కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.
- ప్రభాస్ నటుడు కాకపోయుంటే..? హోటల్ రంగంలో స్థిరపడేవారు.. ■ ప్రభాస్‌కు ఏపీలో శ్రీశైలం అంటే ఎంతో ఇష్టం
- **ఇష్టమైన పాట:** 'వర్షం'లోని 'మెల్లగా కరగనీ రెండు మనసుల దూరం'.
- **నటులు:** షారుఖ్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, రాబర్ట్ డి నిరో, జయసుధ, శ్రియ, త్రిషలకు ప్రభాస్ అభిమాని.

## ప్రభాస్.. రూ. 7 వేల కోట్లు

సలార్, కల్కి తర్వాత ప్రభాస్ మార్కెట్ ప్రపంచవ్యాప్తంగా భారీగా పెరిగిపోయింది. ఒకప్పుడు టాలీవుడ్, బాలీవుడ్ మధ్య దూరం ఎక్కువగా ఉండేది. మన సినిమాలంటే హిందీ బెల్ట్‌లో చిన్నచూపు. కానీ, ప్రభాస్ రాకతో తెలుగు సినిమాకు గౌరవం తీసుకొచ్చాడు. అతను వేసిన దారిలోనే నేడు మన చిత్రాలన్నీ హిందీలో మెప్పిస్తున్నాయి. ప్రస్తుతం ఇండియన్ బాక్సాఫీస్ వద్ద ప్రభాస్‌తో వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టనున్నారు. ఈ క్రమంలో బాహుబలి: ది ఎపిక్ పేరుతో తన ఫ్రాంచైజీ చిత్రాన్ని ఒకే భాగంగా ఈ నెల 31న విడుదల చేస్తున్నారు. ఆ తర్వాత రాజాసాబ్, దర్శకుడు హను రాఘవపూడితో మరో చిత్రం లైన్‌లో ఉంది. స్పిరిట్, కల్కి-2, సలార్-2 వంటి సినిమాలు కూడా లైన్‌లో ఉన్నాయి. ఇక మీద ఏడాదికి రెండు సినిమాలు విడుదలయ్యేలా ప్రభాస్ ప్లాన్ చేస్తున్నారట. అందుకే ఇలా ఒకేసారి రెండు మూడు చిత్రాల్లో నటిస్తూ, లైనప్‌లో మరో రెండు మూడు సినిమాలు ఖరారు చేసి, బిజీ బిజీగా ఉంటున్నారు ప్రభాస్. ఇలా ప్రభాస్ నటిస్తున్న 5 సినిమాలు కూడా ఈ రెండు ఏళ్లలోనే విడుదల కావచ్చు. దీంతో బాక్సాఫీస్ వద్ద ఆయన ఐదు చిత్రాలకు సంబంధించి ఏకంగా రూ. 7వేల కోట్లు పైగానే మార్కెట్ చేయవచ్చని ఒక అంచనా ఉంది. ఈ లెక్కలు తలుచుకుంటేనే వామ్మో అనిపిస్తోంది కదా.. అయినా ఇదే నిజం.




## ప్రభాస్, హను కొత్త సినిమా టైటిల్ ప్రకటన

ప్రభాస్, హను రాఘవపూడి కొత్త సినిమా టైటిల్‌ను ప్రకటించేశారు. నేడు (అక్టోబర్ 23) డార్లింగ్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. ముందుగా అనుకున్నట్లుగానే ఈ మూవీకి "ఫౌజీ" అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రానుంది. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. 1930వ దశకంలో జరిగిన సంఘటనల ఆధారంగా వాటికి కొంత ఫిక్షన్ జోడించి ఈ మూవీని తెరకెక్కించనున్నారు. ఇందులో కొత్త భామ ఇమాన్వి కథానాయికగా నటిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్, జయప్రద వంటి స్టార్స్ నటిస్తున్నారు. మన చరిత్రలోని దాగి ఉన్న అధ్యాయాల నుండి ఒక సైనికుడి ధైర్య కథను ఫౌజీలో చూపిస్తామని దర్శకుడు హను రాఘవపూడి చెప్పారు. ప్రభాస్‌ను ఫౌజీగా పరిచయం చేయడంలో తనకు చాలా గర్వంగా ఉందన్నారు. 'ఇప్పటివరకు ఈ ప్రయాణం మరపురానిది.. ఫౌజీ నుంచి ఈ జర్నీ మరింత పెద్దదిగా ఉంటుందని హామీ ఇస్తున్నా' అంటూ హను పోస్ట్ చేశారు. ఈ సినిమా షూటింగ్ కూడా ఇప్పటికే సగంపైగానే పూర్తి అయింది. ఫస్ట్ షెడ్యూల్ తమిళనాడులో ప్రారంభమైంది. కారైకుడి, మధురై లొకేషన్స్‌లో ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొనగా కీలక సన్నివేశాల చిత్రీకరణ చేశారణ టాక్. ఇక ఈ సినిమాలో ఓ బ్రాహ్మణ యువకుడి పాత్రలో ప్రభాస్ కనిపిస్తారని, సినిమాలో దేవీపురం అనే బ్యాక్‌డ్రాప్ ఉంటుందనే ప్రచారం జరుగుతోంది.

# బ్రేకప్..

## గుండెనిండా బాధ..

తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది రష్మిక మందన్నా. ఇటీవలే హారర్ కామెడీ థ్రిల్లర్ థామాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. ఇకపోతే ఈ మధ్యే తెలుగు హీరో విజయ్ దేవరకొండతో రష్మిక ఎంగేజ్‌మెంట్ జరిగింది. దీనికంటే ముందు రష్మికకు లవ్ బ్రేకప్ అనుభవం ఉన్న విషయం తెలిసిందే. గతంలో కన్నడ హీరో రక్షిత్ శెట్టితో ప్రేమాయణం సాగించి నిశ్చితార్థం కూడా జరుపుకుంది. పెళ్లి బంధంతో ఒక్కటవుతారనుకుంటే.. బ్రేకప్ చెప్పుకుని ఎవరి దారి వారు చూసుకున్నారు.

### మగవారిలా గడ్డం పెంచలేం

ఇటీవల ఓ భేటీలో రష్మిక.. ప్రేమ, బ్రేకప్ గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ప్రేమ, బ్రేకప్‌లో విషయంలో మహిళల కంటే పురుషులే ఎక్కువగా బాధపడతారనే మాటను అంగీకరించనంది. బ్రేకప్ వల్ల మహిళలే ఎక్కువ బాధ, వేదనకు గురవుతున్నారని పేర్కొంది. తమ బాధను వ్యక్తం చేయడానికి మగవారిలా గడ్డం పెంచడం, మద్యం తాగడం వంటివి చేయలేమంది. మనసులోనే బాధను భరిస్తుంటామని, బయటకు వ్యక్తం చేయలేమని తెలిపింది. ఆమె వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కాగా రష్మిక మందన్నా ఉమెన్ సెంట్రిక్ పాత్రలో నటించిన ది గర్ల్ ఫ్రెండ్ చిత్రం నవంబర్ 7న విడుదల కానుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com